



www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI





శనివారం | 18-1-2025 | పేజీలు: 10 + 8 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 273 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతరుతువు, పుష్యమాసం, బహుళపక్షం; తిథి: పంచమి పూర్తి; నక్షత్రం: పుబ్బ మ. 2.51 తదుపరి ఉత్తర; వర్జ్యం: రా. 10.50-12.37; దుర్ముహూర్తం: ఉ. 6.52-8.21; అమృతఘడియలు: ఉ. 7.53-9.37; రాహుకాలం: ఉ. 9.30-10.30; సూర్యోదయం:6.52; సూర్యాస్తమయం: 5.58 | తిరుపతి సిటీ


Tirupathi | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



29వ వర్ధంతి
నా పరిపూర్ణ, పరిశుద్ధ హృదయంతో..
నిను కొల్చు భాగ్యం ఇంకెప్పుడూ..
ప్రభూ... ఈ జన్మకూ...
BOMMARILLU
ఆయన వీరాభిమాని
"బొమ్మరిల్లు వారి" సంస్థ అధినేత
వై.వి.ఎస్. చౌదరి


SITHARA ENTERTAINMENTS
SRIKARA STUDIOS
FORTUNE FOUR CINEMAS
KING OF SANKRANTI
A BOBBY KOLLI FILM
డాకు మహారాజ్
SURYADEVARA NAGA VAMSI SAI SOUJANYA
A THAMAN S MUSICAL
ADITYA MUSIC


MAHAAKAAL PICTURES
TRAILER OUT NOW
IN CINEMAS FROM
24th JAN
హాల్ట్
DIRECTOR SRIVIDYA BASAWA PRODUCER S PRASHANTH REDDY
D.O.P ABHIRAJ NAIR MUSIC DIRECTOR NARESH KUMARAN P EDITOR ANIL KUMAR P
COLORIST K VISHNUVARDHAN SFX SYNC CINEMA MIXING ENGG ARAVIND MENON
ART DIRECTOR S PRASHANTH REDDY EP S SRIKANTH REDDY PUBLICITY DESIGN ARKO


GOKULAM GOPALAN
SREE GOKULAM MOVIES
RAGAM MOVIES
MOVIE MAXX
SREENIWAAS MANIDALA
SVM
SRI VEDAKSHARA MOVIES
CHINTHAPALLI RAMARAO
TOVINO THOMAS
IDENTITY
తెలుగులో
2025 లో విడుదలైన తొలి మలయాళ సూపర్ హిట్ చిత్రం 40 కోట్లు వసూలు చేసి తెలుగులో యాక్షన్ థ్రిల్లర్ మూవీగా విడుదలవుతోంది.
WRITTEN & DIRECTED BY
AKHIL PAUL – ANAS KHAN
PRODUCER PRODUCER
RAJU MALLIATH DR ROY C J
24TH JAN 2025


SMT. ANITHA PRESENTS
SRI VENKATESWARA CREATIONS
GLOBAL STAR
RAM CHARAN
ZEE STUDIOS
DIL RAJU PRODUCTION
SANKRANTI BLOCKBUSTER
SHANKAR'S
GAME CHANGER
PRODUCED BY RAJU - SHIRISH
A THAMAN S MUSICAL
TELUGU - TAMIL - HINDI - KANNADA - MALAYALAM
NOW IN CINEMAS


DIL RAJU PRESENTS
SRI VENKATESWARA CREATIONS
BLOCKBUSTER PONGALUU
సంక్రాంతికి వస్తున్నాం
AN ANIL RAVIPUDI FILM
PRODUCER SHIRISH
T-SERIES

www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఫ్లెమింగో ఫెస్టివల్‌కు వెళ్తున్నారా.. విహంగాల అందాలనే కాదు కనువిందు చేసే ప్రదేశాలెన్నో చూసి రండి.. ప్రాచీన ఆలయాలే కాదు చేరువలోని శ్రీహరికోట అంతరిక్ష పరిశోధన కేంద్రాన్ని (అనుమతితో) సందర్శించవచ్చు. దేశంలోనే అద్భుత పారిశ్రామికవాడ శ్రీసిటీని చుట్టేయవచ్చు. ఇంకెందుకు ఆలస్యం.. పదండి..పెలికాన్ పక్షులు మీకు స్వాగతం పలకడానికి ఉవ్విళ్లూరుతున్నాయి..




-2లో



## మంచు దుప్పట్లో రామకుప్పం





వారం రోజులుగా రామకుప్పంలో వాతావరణం ఊటీని తలపిస్తోంది.గతంలో ఎన్నడూ లేని విధంగా దట్టమైన పొగమంచు కమ్మేస్తోంది. చలి తీవ్రత పెరుగుతుండడంతో వృద్ధులు, చిన్నారులు బాగా ఇబ్బంది పడుతున్నారు.. గురు, శుక్రవారాల్లో ఉదయం ఉష్ణోగ్రతలు 10నుంచి 12 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యాయి.మంచు తెరలు వీడకపోవడంతో ఉదయం 9.30గంటలు దాటాకే జనం ఇళ్ళ నుంచి బయటకు వస్తున్నారు. వాహనదారులు లైట్లు వేసుకుని రాకపోకలు సాగిస్తున్నారు.సాయంత్రం 4గంటలకు తిరిగి మంచు తన ప్రతాపం చూపుతుండడంతో వీధులు నిర్మానుష్యంగా మారుతున్నాయి.గ్రామాల్లో చలిమంటలు వేసుకుని ఉపశమనం పొందుతున్నారు.

- రామకుప్పం, ఆంధ్రజ్యోతి

## స్వర్ణ రథంపై వరసిద్ధుడి విహారం

ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో శుక్రవారం సంకటహర గణపతి వ్రతాన్ని భక్తులతో నిర్వహింపజేశారు. ఈ సందర్భంగా ఉదయం మూల విరాట్‌కు వైభవంగా అభిషేకంను నిర్వహించి సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధుడి ఉత్సవర్లను ఆలయ ఆస్థాన మండపానికి తీసుకొచ్చారు. అక్కడున్న వేదికపై కొలువుదీర్చి విశేష పూజలు చేశారు. అనంతరం ఉత్సవర్ల ఎదుట భక్తులను కూర్చోబెట్టి సంకటహర గణపతి వ్రతాన్ని ఆలయ అధికారులు నిర్వహించారు. రాత్రి సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధి వినాయకస్వామి ఉత్సవర్లను స్వర్ణరథంపై ఉంచి ఆలయ మాడవీధుల్లో వైభవంగా ఊరేగించారు. స్వర్ణరథంపై స్వామిని దర్శించుకోవడానికి అధిక సంఖ్యలో భక్తులు కాణిపాకం తరలివచ్చారు. ఈవో పెంచలకిషోర్, ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్లు వాసు, కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్లు బాలాజీనాయుడు, రవి తదితరులు పాల్గొన్నారు.

- ఐరాల(కాణిపాకం), ఆంధ్రజ్యోతి



స్వర్ణరథంపై సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధుడు



సంకటహర గణపతి వ్రతం నిర్వహిస్తున్న భక్తులు

# అర్ధరాత్రి విషాదం

- స్లీపర్ బస్సును ఢీకొట్టిన టిప్పర్
- గంగాసాగరం వద్ద ఘోర ప్రమాదం
- రోడ్డు పక్కనున్న విద్యుత్తు స్తంభం బస్సులోకి దూసుకెళ్లిన వైనం
- నలుగురి మృతి.. 15మందికి గాయాలు



ప్రశాంత్, జీవ, పొన్‌చందర్, శ్రీధర్ మృతదేహాలు




ఎక్స్‌కవేటర్ సాయంతో బస్సును పైకి తీస్తున్న దృశ్యం

చిత్తూరు అర్బన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : చిత్తూరు సమీపంలో గంగాసాగరం వద్ద గురువారం అర్ధరాత్రి జరిగిన ఘోరరోడ్డు ప్రమాదంలో నలుగురు దుర్మరణం పాలయ్యారు. మరో 15మందికి తీవ్ర గాయాలయ్యాయి. తిరుపతి నుంచి మధురై వెళ్లే ఎస్‌ఆర్‌ఎంఎస్ స్లీపర్ బస్సు రోజూ లాగే గురువారం రాత్రి 9.45 గంటలకు తిరుపతిలో 29మంది ప్రయాణికులతో బయల్దేరింది.రాత్రి 11.50గంటలకు చిత్తూరు సమీపం గాజులపల్లె సమీపాన వెళుతుండగా.. హైవే నిర్మాణ పనుల కోసం మట్టిని తరలిస్తున్న ఓ టిప్పర్ వేగంగా ఢీకొంది. దీంతో బస్సు పక్కకు బోల్తా పడింది. రోడ్డు పక్కన పడేసి ఉన్న విద్యుత్తు స్తంభాల్లో ఒకటి బస్సులోకి దూసుకువచ్చింది. అప్పర్ సీట్లలో పడుకుని ఉన్న ప్రయాణికులను ఆ స్తంభం వేగంగా కొట్టడంతో ముగ్గురు బస్సులోనే మరణించారు. వారి తలలు ఛిద్రమైపోయాయి. లోయర్ సీటులో కూర్చున్న మరో వ్యక్తి సీట్ల మధ్యలో నలిగిపోయి మరణించాడు.మరో 15మంది తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద సమాచారం గుడిపాల పోలీసులకు చేరగానే ఆ ప్రాంతం తాలూకా స్టేషన్ పరిధిలోది కావడంతో ఇరు ప్రాంతాల పోలీసులూ ఘటనా స్థలానికి చేరుకున్నారు.అటుగా వెళ్తున్న ప్రయాణికులు, చుట్టుపక్కల జనంతో కలసి క్షతగాత్రులను బయటకు తెచ్చి ఆస్పత్రులకు తరలించారు.



ప్రమాదానికి కారణమైన టిప్పర్

### ప్రాణాలు తీసిన విద్యుత్తు స్తంభం

ప్రమాదం జరిగిన ప్రాంతానికి సమీపంలో సబ్‌స్టేషన్ ఉండడంతో.. దానికి సంబంధించిన విద్యుత్తు స్తంభాలు హైవే పక్కన పడేశారు. టిప్పర్ వేగంగా ఢీకొట్టడంతో బోల్తా పడిన బస్సులోకి అక్కడి విద్యుత్తు స్తంభం ఒకటి దూసుకుపోవడంతో నిద్రలో ఉన్న ముగ్గురు ప్రయాణికుల తలలు ఛిద్రమయ్యాయి. ఒకవేళ అక్కడ స్తంభాలు లేకపోయి ఉంటే ఈ స్థాయిలో నష్టం జరిగేది కాదని సహాయక చర్యల్లో పాల్గొన్నవారు చెబుతున్నారు.



దెబ్బతిన్న బస్సు



మధ్యభాగాన్ని టిప్పర్ ఢీకొట్టడంతో నలిగిపోయిన బస్సు



ఆస్పత్రికి క్షతగాత్రుల తరలింపు - సంఘటనా స్థలిలో కలెక్టర్ తదితరులు - ఆస్పత్రిలో క్షతగాత్రులకు చికిత్స

### ● మృతుల్లో తిరుపతివాసులు

తిరుపతి సప్తగిరి కాలనీకి చెందిన ముత్తు విజయ్ రాజు కుమారుడు పొన్నుచంద్ర (33), ఎన్జీవో కాలనీకి చెందిన ఆదాయ పన్ను శాఖ అధికారి శ్రీకాంత్ కుమారుడు శ్రీధర్ (21), తమిళనాడు రాష్ట్రం తంజావూరు జిల్లా కుంభకోణం సౌరాష్ట్ర వీధికి చెందిన గోవిందరాజన్ కుమారుడు ప్రశాంత్ (31), కన్యాకుమారి జిల్లా తోవలకు చెందిన జీవా (40) అక్కడికక్కడే మృతి చెందారు.తలలు ఛిద్రం కావడంతో మృతదేహాలు గుర్తుపట్టలేనంతగా ఉన్నాయి.వీరిలో తమిళనాడువాసులు తిరుమలలో స్వామి దర్శనం చేసుకుని స్వస్థలానికి వెళుతుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది.ప్రమాదంలో మరణించిన నలుగురికీ చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాలను వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతదేహాలను చూసి కుటుంబ సభ్యులు, బంధువులు ఆసుపత్రి ఆవరణంలో విలపించడంతో అక్కడున్న వారు కూడా చలించిపోయారు.

### ● సహాయక చర్యలు

నిత్యం రద్దీగా ఉండే చిత్తూరు- వేలూరు మార్గంలో ఈ ప్రమాదంతో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పోలీసులు ఎక్సకవేటర్ సాయంతో బోల్తా పడ్డ బస్సును పక్కకు తొలగించి మృతదేహాలను వెలికితీశారు. గుడిపాల, చిత్తూరు తాలూకా ఎస్ఐలు రామ్మోహన్, రమేష్ బాబు క్షతగాత్రులను చీలాపల్లె సీఎంసీతో పాటు చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.సమాచారం తెలిసిన వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న కలెక్టర్.. తెల్లవారుజామున మూడు గంటల వరకు అక్కడే వుండి సహాయక చర్యలను పర్యవేక్షించారు.ఏఎస్పీ రాజశేఖర రాజు, డీఎస్పీ సాయినాథ్, సీఐలు శ్రీనివాసరావు, శ్రీధర్ నాయుడు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పరిశీలించారు.అక్కడినుంచి చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి చేరుకుని క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని వైద్యులను ఆదేశించారు. చిత్తూరు తాలూకా ఎస్ఐ రమేష్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### ● అమ్మ కళ్లెదుటే కుమారుడి మృతి

తిరుపతికి చెందిన పొన్నుచంద్ర (21) తన తల్లి సెల్వ సుందరితో కలిసి మధురైలోని ఆస్పత్రికి బస్సులో వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. కింద సీటులో తల్లి కూర్చోగా.. అప్పర్ బెర్త్‌లో పొన్నుచంద్ర పడుకున్నాడు. టిప్పర్ ఢీకొనడం, బస్సు ఓ వైపునకు వాలడం, స్తంభం దూసుకురావడం..అన్నీ కలిపి పొన్నుచంద్రను మృత్యువు రూపంలో కబళించాయి. కళ్లెదుటే కుమారుడు మృతి చెందడాన్ని చూసిన ఆ తల్లి తనకూ గాయాలైన విషయాన్ని కూడా మర్చిపోయి కన్నీరుమున్నీరైంది. ప్రస్తుతం ఆమె చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతోంది.

#### పండుగ కోసం వచ్చి తిరిగి రాని లోకాలకు



శ్రీధర్ (ఫైల్ ఫొటో)

సంక్రాంతి సెలవుల కోసం తిరుపతికి వచ్చిన కె. శ్రీధర్ వారం రోజులుగా కుటుంబ సభ్యులు, స్నేహితులతో ఆనందంగా గడిపాడు.ఎన్జీవో కాలనీలో కాపురమున్న ఆదాయ పన్ను శాఖ అధికారి శ్రీకాంత్‌కు చిన్న కుమారుడైన శ్రీధర్ తంజావూరులో బీటెక్ మూడవ సంవత్సరం చదువుతున్నాడు. కళాశాలకని బయల్దేరిన కొడుకు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడనే వార్త తెలియగానే కుటుంబం కన్నీటిపర్యంతమైంది.

### మంత్రి సంతాపం

చిత్తూరు సెంట్రల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): గంగాసాగరం వద్ద జరిగిన రోడ్డు ప్రమాద ఘటనలో నలుగురు మృతి చెందడం పట్ల జిల్లా ఇన్‌చార్జి మంత్రి రాంప్రసాద్‌రెడ్డి సంతాపం తెలిపారు. ప్రాణాపాయ స్థితిలోని వారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు. అలాగే చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ మృతుల కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. ఎమ్మెల్యే జగన్మోహన్ తండ్రి చెన్నకేశవులు నాయుడు చిత్తూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నవారిని పరామర్శించారు. మృతదేహాలను స్వస్థలాలకు తీసుకెళ్లేందుకు ఆర్థిక సాయం కూడా అందించారు.

## చెక్ డ్యామ్‌లో మునిగిపోయాడు

- మద్యం మత్తులో జరిగి ఉంటుందని పోలీసుల అనుమానం



వెంకటరమణ మృతదేహం

వెదురుకుప్పం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): చెక్ డ్యామ్ నీటిలో మునిగి ఒకరు మృతి చెందారు. వెదురుకుప్పం ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపిన వివరాల మేరకు.. తిరుపతికి చెందిన వెంకటరమణ(27), శీను.. సామాన్ల వ్యాపార నిమిత్తం శుక్రవారం వెదురుకుప్పం మండలం పచ్చికాపల్లంకు వచ్చారు. వ్యాపారం ముగిశాక పచ్చికాపల్లంలో మద్యం కొనుగోలు చేసి తిరుపతికి బయల్దేరారు. మార్గమధ్యంలో ఎర్రగుంటపల్లె సమీపంలో మద్యం తాగారు. ఆ తర్వాత అక్కడున్న చెక్ డ్యాంలోని నీటిలోకి దిగారు. ఆ నీటిలో మునిగి వెంకటరమణ మృతి చెందాడు. వీరిద్దరూ బావబామ్మర్దిగా గుర్తించారు. మద్యం మత్తులోనే వెంకటరమణ నీటిలో మునిగి మృతి చెంది ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## ఆ భూములపై ఏం చేద్దాం?

- నిషేధిత జాబితా నుంచి తొలగించిన భూములపై అధ్యయనానికి కమిటీ
- మంత్రివర్గ నిర్ణయం

చిత్తూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో నిషేధిత జాబితా నుంచి అక్రమంగా తొలగించిన భూముల వ్యవహారంపై నిర్ణయం తీసుకునేందుకు కూటమి ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుంది.అమరావతిలో శుక్రవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో అక్రమంగా నిషేధిత జాబితా నుంచి తొలగించిన భూముల వ్యవహారంపై చర్చ జరిగింది.దీనిపై అధ్యయనం చేయనున్న మంత్రుల కమిటీ ప్రభుత్వానికి సవివరమైన నివేదిక ఇవ్వనుంది.వైసీపీ పాలనలో జిల్లావ్యాప్తంగా పెద్దఎత్తున భూఅక్రమాలు జరిగాయి. నిషేధిత జాబితాలో వున్న వేల ఎకరాల భూముల్ని అక్రమంగా తొలగించుకున్న వైసీపీ నాయకులు పెద్దఎత్తున లబ్ధి పొందారు. జిల్లాలో ఏకంగా 1.75 లక్షల ఎకరాల అసైన్డ్ భూముల్ని ఫ్రీహోల్డ్ కింద మార్చుకోవాలని వైసీపీ నేతలు ప్రయత్నించగా.. ఫైనల్‌గా అప్పటి జిల్లా అధికారులు 84 వేల ఎకరాలకు లైన్ క్లియర్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ అంశంపై రీవెరిఫికేషన్ చేయాలని అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. అధికారులు కూడా వైసీపీ హయాంలో జరిగిన భూఅక్రమాల లెక్కల్ని సిద్ధం చేసి పెట్టారు.

### ● ఫ్రీహోల్డ్, '22ఏ తొలగింపు' భూముల వివరాలు

వైసీపీ హయాంలో జిల్లాలో 1,75,197 ఎకరాల అసైన్డ్, ఎక్స్ సర్వీస్‌మెన్, డాటెడ్, ఎండోమెంట్ ల్యాండ్స్‌ను ఫ్రీహోల్డ్ కింద క్లియరెన్సు ఇవ్వాలని క్షేత్ర స్థాయి వీఆర్వో, ఎమ్మార్వో వంటి అధికారుల నుంచి జిల్లా అధికారులకు నివేదికలు అందాయి. సరైన రికార్డులు లేని 82,408 ఎకరాల్ని వివాదాస్పద భూములుగా మార్చారు. 8410 ఎకరాలకు క్లియరెన్స్ ప్రొసీడింగ్స్ ఇవ్వకుండా పక్కన పెట్టేశారు. 84,378 ఎకరాలకు మాత్రం ఫ్రీహోల్డ్ కింద మార్చారు. అలాగే ఐదేళ్లలో 6939 ఎకరాల్ని 22ఏ జాబితా నుంచి తొలగించారు.

### ● పెద్దిరెడ్డి ఇలాకాలోనే అధికం

జిల్లావ్యాప్తంగా 84378 ఎకరాల అసైన్డ్ భూముల్ని ఫ్రీహోల్డ్ కిందికి మార్చగా.. వీటిలో ఒక్క పుంగనూరు నియోజకవర్గంలోనే 29424 ఎకరాలున్నాయి. అంటే జిల్లా మొత్తంగా 35 శాతం భూముల క్లియరెన్సు ఒక్క పుంగనూరులోనే జరిగింది. నియోజకవర్గంలోని సోమల మండలంలో 7601ఎకరాలకు, పుంగనూరులో 5557, చౌడేపల్లెలో 5095, సదుంలో 4696, రొంపిచెర్లలో 3925, పులిచెర్లలో 2550 ఎకరాలకు లైన్ క్లియర్ చేసుకున్నారు.

### ● కుప్పంలో 8936 ఎకరాలు

కుప్పం నియోజకవర్గంలో అసైన్డ్ భూముల జాబితాను పరిశీలిస్తే 8936 ఎకరాల్ని ఫ్రీహోల్డ్ కింద మార్చారు. గుడుపల్లెలో 245, శాంతిపురంలో 580.8, కుప్పంలో 982, రామకుప్పంలో 7128 ఎకరాల్ని ఫ్రీహోల్డ్ కిందికి మార్చారు.

### ● '22ఏ జాబితా'లోనూ పుంగనూరుకే ప్రాధాన్యం

ఇక 22ఏ జాబితా నుంచి తొలగించిన భూముల విషయానికొస్తే.. జిల్లావ్యాప్తంగా 6939 ఎకరాలను నిషేధిత జాబితా నుంచి తొలగించగా..వాటిలో ఒక్క పుంగనూరు నియోజకవర్గంలోనే 3030 ఎకరాలున్నాయి. రొంపిచెర్లలో 1938, పుంగనూరులో 998, పులిచెర్లలో 54, సదుంలో 30.50, చౌడేపల్లెలో 9.50 ఎకరాల్ని నిషేధిత జాబితా నుంచి తొలగించారు. కుప్పం నియోజకవర్గానికి సంబంధించి శాంతిపురం మండలంలో 2 ఎకరాలు, కుప్పంలో 21, గుడుపల్లెలో 24, రామకుప్పంలో 211 ఎకరాల్ని 22ఏ జాబితా నుంచి తొలగించారు.

## ఎస్సీ, ఎస్టీల గుర్తింపు సర్వేను వేగవంతం చేయండి

- 'పీఎం సూర్యఘర్'పై ఎస్ఈ సమీక్ష

చిత్తూరు రూరల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీలకు పీఎం సూర్యఘర్ పథకం ద్వారా ఉచితంగా సోలార్ ప్యానళ్ల ఏర్పాటుకు చేపట్టిన గుర్తింపు సర్వేను వేగవంతం చేయాలని అధికారులను ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ ఆదేశించారు. శుక్రవారం చిత్తూరు ఆపరేషన్ డివిజన్ కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. గత నెల నుంచి ప్రతి బిల్లుపై క్యూఆర్ కోడ్‌ను ముద్రించడం జరిగిందన్నారు. దాన్ని వాటిని స్కాన్ చేసి ఫోన్‌పే, గూగుల్, పేటీఎం వంటి యాప్‌లతో బిల్లు చెల్లించవచ్చని, దీనిపై వినియోగదారులకు అవగాహన కల్పించాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల ఫెయిల్యూర్స్‌ను తగ్గించాలని తెలిపారు. ప్రతి నెలా ఐదో తేదీలోపు బిల్లింగ్ పూర్తి చేయాలని చెప్పారు. పెండింగ్ బకాయిల వసూళ్లపై దృష్టి పెట్టాలని సూచించారు. వ్యవసాయానికి తొమ్మిది గంటల అంతరాయం లేని నాణ్యమైన విద్యుత్ అందించాలన్నారు. ఈ సమావేశంలో ఈఈ మునిచంద్ర, డీఈలు ఆనంద్, ప్రసాద్, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవారి సేవలో ప్రముఖులు


నూకసాని బాలాజీ


పీఎంఎస్ ప్రసాద్


విజయేంద్ర ప్రసాద్


అంబికా కృష్ణ


దివి


నీలిమా రాణి


ఆర్పీ ఠాకూర్


జగన్మోహన్

తిరుమల, జనవరి 17(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ, రిలయన్స్ సంస్థ సీఈవో పీఎంఎస్ ప్రసాద్, సినీ రచయిత విజయేంద్రప్రసాద్, నిర్మాత అంబికా కృష్ణ, నటులు దివి, నీలిమా రాణి, మాజీ డీజీ ఆర్పీ ఠాకూర్, చిత్తూరు ఎమ్మెల్యే జగన్మోహన్ ఉన్నారు.


### పెరిగిన హుండీ ఆదాయం

తిరుమలలో రద్దీ కొనసాగుతోంది. చలి తీవ్రత కూడా పెరగడంతో వసతి దొరకని భక్తులు అవస్థ పడుతున్నారు. హుండీ ఆదాయం కూడా పెరిగింది.

బుధవారం నాటి హుండీ ఆదాయం : రూ.4.03 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 67,115

తలనీలాలు సమర్పించినవారు : 16,656





# ఏ ఊరెళ్లి... ఏమేమి చూద్దాం..!

ఫ్లెమింగో ఫెస్టివల్‌కు వచ్చే పర్యాటకులు సందర్శించదగిన ప్రదేశాలు ఎన్నో సూళ్లూరుపేట పరిసరాల్లో ఉన్నాయి. విహంగాల అందాలతో పాటూ ప్రాచీన ఆధ్యాత్మిక క్షేత్రాలనూ సందర్శించవచ్చు. సూళ్లూరుపేట, తడల్లో అనేక హోటల్స్ అందుబాటులో ఉంటాయి. తడలో స్టార్ హోటల్స్, పోష్ రెస్టారెంట్లు కూడా ఉన్నాయి. పులికాట్ రొయ్యలు, చేపలు, పీతలు ఈ ప్రాంతపు ప్రత్యేక డిష్‌లు.

- దొరవారిసత్రం, సూళ్లూరుపేట, తడ (ఆంధ్రజ్యోతి)

● ఫ్లెమింగో ఫెస్టివల్ పర్యాటక ప్రదేశాలు... వాటి విశేషాలు









### సూళ్లూరుపేటలో ప్రదర్శన స్టాల్స్:



ఫ్లెమింగ్ ఫెస్టివల్ ప్రధాన వేదిక సూళ్లూరుపేట బస్టాండ్ ఎదురుగా ఉన్న జూనియర్ కళాశాల మైదానం. ఇక్కడ ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నారు.ఉద్యానవన శాఖ, షార్ రాకెట్ కేంద్రం, ఇతర ప్రభుత్వ శాఖల స్టాల్స్ ఇక్కడ ఉంటాయి. ప్రతిరోజూ సాయంత్రం నుంచి ఇక్కడ అద్భుతమైన సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి.

### మన్నారుకృష్ణస్వామి గుడి:



సూళ్లూరుపేట-శ్రీకాళహస్తి రోడ్డులో మూడు కిలోమీటర్ల దూరంలో మన్నారుపోలూరులో 11వ శతాబ్దం నాటి చారిత్రక దేవాలయం ఉంది. నిలువెత్తు జాంబవంతుడి విగ్రహం, కన్నీరు కారుస్తున్నట్టు ఉండే గరుత్మంతుడి విగ్రహం ఈ ఆలయంలోని ప్రత్యేకతలు. టీటీడీ ఆధ్వర్యంలో ఇక్కడ పూజలు జరుగుతాయి.

### శ్రీచెంగాళమ్మ ఆలయం:

సూళ్లూరుపేట బస్టాండు నుంచి దక్షిణం వైపునకు ఒక కిలోమీటరు దూరంలో చెంగాళమ్మ ఆలయం ఉంటుంది. తలుపులు లేని ఆలయంగా ప్రసిద్ధి చెందిన ఈ ఆలయంలో శతాబ్దాల నాటి చెట్టు ప్రత్యేక ఆకర్షణ. శ్రీహరికోటలో ఎగరేసే ప్రతి రాకెట్టుకూ ముందుగా ఈ ఆలయంలో పూజలు చేయడం సంప్రదాయం.

### ఫ్లెమింగోల కోసం పులికాట్‌కి :

ఫ్లెమింగో పక్షులు వేలాదిగా కనిపించే ప్రదేశం శ్రీహరికోట రోడ్డులోని పులికాట్ సరస్సు. ఈ రోడ్డులోని అటకానితిప్ప వరకూ ప్రయాణిస్తే పులికాట్‌లో రొయ్యలు వేటాడే జాలర్లు, ఫ్లెమింగో పక్షులూ కనిపిస్తాయి. ఈ ఏడాది పులికాట్‌కు 25 వేల పైచిలుకు ఫ్లెమింగోలు వచ్చి ఉన్నాయి. వేనాడు, పేర్నాడులకు దారితీసే మట్టిరోడ్లలో కొంతదూరం ప్రయాణిస్తే కూడా పక్షులు కనిపిస్తాయి.



### పక్షుల పండుగ కార్యక్రమాల వివరాలు ఇలా..

**తొలిరోజు..**

● చెంగాళమ్మ ఆలయం నుంచి శోభాయాత్ర ● బెలూన్ల విడుదల ● ప్రారంభోత్సవం ● సాయంత్రం 4 గంటలకు పాఠశాల విద్యార్థులకు సాంస్కృతిక పోటీలు ● 5 గంటలకు సాంస్కృతిక వేడుకలు ● రాత్రి 7 గంటలకు కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు

**రెండవ రోజు**

● మధ్యాహ్నం వరకు క్రీడా పోటీలు ● సాయంత్రం 4 గంటలకు విద్యార్థుల సాంస్కృతిక పోటీలు ● రాత్రి 7 గంటలకు ప్రముఖ కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలు

**మూడవ రోజు**

● ఉదయం 10 గంటలకు వంటల పోటీలు ● సాయంత్రం 4 గంటలకు ముగింపు వేడుక ● 5 గంటలకు సంప్రదాయ సంస్కృతి వేడుక ● 7 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు

### చేనేత అందాలు :

మన్నారుపోలూరు చేనేత చీరలకు ప్రసిద్ధి. చెన్నైలోని ప్రముఖ వాణిజ్య సంస్థలు కుమరన్, శరవణన్, నల్లి, జయచంద్ర, చెన్నై శిల్క్స్ వంటి వారికి ఇక్కడ నుంచి చేనేత చీరలు సరఫరా అవుతాయి. మహిళలు మంచి చీరలను ఎంపిక చేసుకోవడం కోసం ఈ గ్రామాన్ని సందర్శించవచ్చు.

**నేలపట్టు:** సూళ్లూరుపేట, నాయుడుపేట మధ్య ఉన్న దొరవారిసత్రానికి 2 రెండు కిలోమీటర్ల దూరంలో హైవేకు తూర్పు వైపున నేలపట్టు ఉంది. ఇక్కడ ఉన్న రెండు మంచినీటి చెరువుల్లోని కడప చెట్లపై వేలాది పక్షులు ఉంటాయి. సుదూర దేశాల నుంచి వచ్చిన ఈ పక్షులు ప్రస్తుతం చెట్లపై గూళ్లు కట్టుకుని పిల్లల్ని పొదిగి ఉన్నాయి. ఇక్కడ బైనాకులర్స్ కూడా అందుబాటులో ఉంటాయి.



### వెదురుపట్టు:

దొరవారిసత్రం, సూళ్లూరుపేట మధ్య జాతీయ రహదారిపై పడమర వైపున 10 కి.మీ దూరంలో కాళంగి నది ఒడ్డున వెదురుపట్టు నర్సమాంబపురం అగ్రహారం ఉంది. ఈ చిన్న గ్రామంలో ఇళ్ల మధ్యన ఉన్న నాలుగు చింత చెట్లమీద పెయింటెడ్ స్టార్క్స్ (ఎర్రకాళ్ల కొంగలు) ఉంటాయి. ఇవి స్థానికులతో కలసి జీవించడం ఇక్కడి ప్రత్యేకత.



### శ్రీహరికోట రాకెట్ కేంద్రం:

సూళ్లూరుపేటకు 18 కిలోమీటర్ల దూరంలో శ్రీహరికోట అంతరిక్ష పరిశోధన కేంద్రం ఉంది. వందవ రాకెట్ ప్రయోగానికి సిద్ధమవుతున్న షార్‌లోకి అడుగుపెట్టాలంటే మాత్రం ప్రత్యేక అనుమతి ఉండాలి. అయితే రాకెట్ కేంద్రం ప్రధాన గేటు ముందుండే అన్ని రాకెట్‌ల నమూనాల వద్ద సెల్ఫీలు తీసుకోవచ్చు.





### పడవెక్కాలంటే భీములవారి పాళెం వెళ్లాలి :

సూళ్లూరుపేట నుంచి చెన్నై వెళ్లే మార్గంలో 15 కి.మీ దూరంలో భీములవారిపాళెం పడవల రేవు ఉంది. ఇక్కడ తెరచాప పడవలు, మోటారు బోటు పడవలు ఉంటాయి. పర్యాటకులు ఈ పడవల్లో పులికాట్ సరస్సులో విహరించవచ్చు. ఇరకం దీవి వరకూ పడవలో వెళ్లి రావచ్చు.



**వేనాడు దర్గా:** శ్రీహరికోట రోడ్డులో అటకానితిప్ప నుంచి దక్షిణం వైపునకు మట్టిరోడ్డులో 12 కిలోమీటర్లు ప్రయాణిస్తే వేనాడుకు చేరుకోవచ్చు. ఇక్కడి హజరత్ దావూద్ అవులియా దర్గా బాగా ప్రసిద్ధి చెందింది. ఏటా ఇక్కడ జరిగే గంథోత్సవానికి ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రహమాన్ హాజరవుతుంటారు. ఇక్కడే ప్రాచీన కాలం నాటి ఆలయం ఉంది. ఒకే ప్రాంగణంలో శివాలయం, విష్ణు ఆలయం ఉండడం ప్రత్యేకత. శృంగి మహర్షి కావడిలోని ఒక బుట్టలో శివలింగంను, మరొకదానిలో విష్ణు విగ్రహాన్ని పెట్టుకుని కాశి నుంచి కన్యాకుమారికి బయలుదేరాడని, దారిలో సేద తీరేందుకు కావడిని వేనాడు దీవిలో కిందకు దించగా విగ్రహాలు రెండూ ఇక్కడే స్థాపితం అయిపోయాయని పురాణ ఐతిహ్యం ప్రచారంలో ఉంది.





**శ్రీసిటీ:** దేశంలోనే అద్భుత పారిశ్రామికవాడగా ప్రసిద్ధి చెందిన శ్రీసిటీ సందర్శన ప్రత్యేక అనుభూతిని ఇస్తుంది. తడ వద్ద నుంచి శ్రీసిటీలోకి ప్రవేశించవచ్చు. హాలీవుడ్ నటులు తొడుక్కునే కోట్‌ల నుంచి, మెట్రో రైళ్ల దాకా ఇక్కడ తయారవుతున్నాయి.

## ప్రతి మూడవ శనివారం స్వచ్ఛ దివస్‌ను పాటించాలి

**- కలెక్టర్ వెంకటేశ్వర్ -**

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రతి నెల మూడవ శనివారం స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛ దివస్‌ను నిర్వహించాలని అధికారులను కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. శుక్రవారం టెలి కాన్ఫరెన్సు ద్వారా మున్సిపల్ కమిషనర్లు, జిల్లా, మండల స్థాయి అధికారులకు దిశానిర్దేశం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతినెలా మూడవ శనివారం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం నిర్వహించాలన్నారు. ఏప్రిల్ లోపు ఇంటింటి చెత్త సేకరణ వందశాతం నిర్వహించేలా, అక్టోబరు లోపు చెత్తకుప్పలు లేకుండా చేయాలన్నదే ముఖ్య ఉద్దేశ్యమన్నారు. మన ఇల్లు, మన కార్యాలయం, సచివాలయాలు, బస్టాండ్లు, పరిసరాల పరిశుభ్రత పాటించడం చేయాలన్నారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ వారిని చైతన్యవంతులను చేస్తూ మానవ హారం తదితర కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. చెత్తకుప్పలను తొలగించి ఆ స్థలంలో చెట్లు నాటే కార్యక్రమం చేయాలని సూచించారు. మురుగుకాలువలను శుభ్రం చేయించాలని, ప్రజలు తడి, పొడిచెత్తను వేర్వేరుగా పారిశుధ్య కార్మికులకు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్లు, ఆర్డీవోలు, పంచాయతీరాజ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో గీత కార్మికులకు 23 మద్యం దుకాణాలు

తిరుపతి(నేరవిభాగం), జనవరి 17(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సందర్భంగా గీత కార్మికులకు ప్రత్యేకంగా మద్యం దుకాణాలు కేటాయిస్తామని ఇచ్చిన హామీని సీఎం చంద్రబాబు నిలబెట్టుకున్నారు. ఇప్పటికే జిల్లాలో దాదాపు 227 ప్రైవేటు మద్యం దుకాణాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీనికి తోడు కల్లు గీత కార్మికులకు సైతం దాదాపు 23 మద్యం దుకాణాలను కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీనికోసం దరఖాస్తుదారులు తప్పనిసరిగా కుల ధృవీకరణ పత్రం సమర్పించాలి. దరఖాస్తు రుసుం రూ.2 లక్షలుగా ప్రభుత్వం నిర్ణయించింది. లైసెన్సు ఫీజు మాత్రం సగం చెల్లిస్తే సరిపోతుంది. 2016లో చేసిన స్మార్ట్ పల్స్ సర్వే ఆధారంగా కులాల జనాభా ప్రాతిపదికన ఈ దుకాణాలు కేటాయించనున్నారు. ఇప్పటి వరకు అందిన సమాచారం మేరకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల కంటే తిరుపతి జిల్లాకు అత్యధికంగా దాదాపు 23 మద్యం దుకాణాలను కల్లు గీత కార్మికులకు కేటాయిస్తుండటంతో వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## హెల్మెట్‌ను బరువుగా కాకుండా బాధ్యతగా తీసుకోండి...

**- జిల్లా రవాణాశాఖాధికారి మురళీమోహన్ -**

తిరుపతి (జీవకోన), జనవరి 17(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహన వినియోగదారులు హెల్మెట్‌ను బరువుగా కాకుండా బాధ్యతగా తీసుకోవాలని జిల్లా రవాణా శాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్ అన్నారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం రవాణాశాఖ కార్యాలయంలో లైసెన్స్ కోసం హాజరైన వాహనదారులకు హెల్మెట్ ధారణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ద్విచక్ర వాహనదారుడు, వెనుక కూర్చున్నవారు కూడా హెల్మెట్ ధరించాలని సూచించారు. అనుకోకుండా ప్రమాదం జరిగితే హెల్మెట్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు సుబ్రహ్మణ్యం, శ్రీనివాసరావు, అతికానాజ్‌లు మాట్లాడుతూ హెల్మెట్ తప్పనిసరిగా బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ ప్రమాణాలను పాటించేలా ఉండాలని సూచించారు. అనంతరం కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంవీఐలు స్వర్ణలత, ఏవో శ్రీనివాసులు, కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


వాహనదారులతో మాట్లాడుతున్న డీటీవో మురళీమోహన్

## హత్య కేసులో ముగ్గురికి యావజ్జీవం


యావజ్జీవశిక్ష పడిన ముగ్గురు నిందితులతో పోలీసులు

● ఒక్కొక్కరికి రూ.12వేల జరిమానా

కేవీబీపురం, జనవరి 17(ఆంధ్రజ్యోతి): హత్య కేసులో ముగ్గురికి యావజ్జీవ శిక్షతో పాటు రూ.12వేలు చొప్పున జరిమానా విధిస్తూ శ్రీకాళహస్తి 12వ అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్‌నాయక్ తీర్పునిచ్చారు. సీఐ కొండయ్య కథనం మేరకు.. మండలంలోని మఠం గ్రామానికి చెందిన పల్లమాల కుప్పయ్య (55) రెండవ కోడలితో అదే గ్రామానికి చెందిన గంగరాజు (35) అసభ్యంగా ప్రవర్తించాడు. ఆ విషయంలో గంగరాజును కుప్పయ్య పలుమార్లు మందలించాడు. దీంతో అతడిని అంతమొందించాలని గంగరాజు పథకం వేశాడు. 2017 డిసెంబరు 30న పెరిందేశం గ్రామానికి లోకేష్(33), రాజా(36)తో కలిసి మద్యం తాగడానికి కుప్పయ్యను పిలిపించి ముగ్గురూ కలిసి హత్యచేశారు. మృతదేహాన్ని పక్కనే ఉన్న బీడుభూమిలో వేశారు. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేశారు. నేరం రుజువు కావడంతో కోర్టు వారికి శిక్ష విధించింది. పీపీగా వీరరాఘవరెడ్డి, కోర్టు లైజన్ అధికారిగా గోపాల్‌రాజు వ్యవహరించారు. కాగా కేసులో పురోగతి చూపిన కానిస్టేబుల్ దాము ప్రత్యేక ప్రశంసలు పొందారు. కానిస్టేబుళ్లు కలాం, దయాకర్ పాల్గొన్నారు.

## భక్తుల సౌకర్యార్థం హెల్ప్‌డెస్క్

తిరుపతి(సెంట్రల్), జనవరి 17 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో వైకుంఠ ద్వార దర్శనం కోసం వచ్చిన భక్తుల కోసం తిరుపతి రైల్వేస్టేషన్‌లో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారి సందేహాలను నివృత్తి చేస్తున్నారు. అలాగే ఉత్తర భారత దేశంలో ప్రారంభమైన పుష్కర స్నానాలు ఆచరించడానికి వెళ్లే భక్తులకు కమర్షియల్ విభాగం టీటీఐలు సేవలందిస్తున్నారు.ఈ కేంద్రాల్లో సిబ్బంది 24 గంటలు పనిచేస్తారని అధికారులు తెలిపారు.



తిరుపతి రైల్వే స్టేషన్‌లో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్

## వరికి సోకే అగ్గి తెగులుపై అప్రమత్తమిలా..

తిరుపతి(ఎంఆర్‌పల్లె), జనవరి 17(ఆంధ్రజ్యోతి): దాదాపుగా నాట్లు పూర్తి కావస్తున్న వరికి అగ్గి తెగులు సోకే ప్రమాదం ఉందని వ్యవసాయశాఖ జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ మెరుగు భాస్కరయ్య తెలిపారు. డిసెంబరు నుంచి ఫిబ్రవరి వరకూ మంచుతో కూడిన చల్లని వాతావరణం ఈ తెగులు వ్యాప్తి అనుకూలమన్నారు. తొలిదశలోనే గుర్తించి రైతులు అప్రమత్తమైతే దీనిని నివారించవచ్చునన్నారు. లేకుంటే నారు దశ నుంచే పైరును ఆశించి నష్టపరుస్తుందన్నారు.


మెరుగు భాస్కరయ్య, జిల్లా వ్యవసాయశాఖ వనరుల కేంద్రం ఏడీఏ



**లక్షణాలు**

తెగులు ఆశించిన ఆకులపై చిన్నచిన్న గోధుమ రంగు మచ్చలు ఏర్పడతాయి. క్రమంగా పెద్దవై మచ్చల మధ్య బూడిద రంగుగా మారుతుంది. తరువాత మొత్తం కాలినట్లు కనిపిస్తుంది. వెన్నుల కణుపు మీద ఆశిస్తే వెన్ను విరిగి పైరు వాలిపోతుంది.

**నివారణమార్గాలు**

● అగ్గి తెగులుకు ఆశ్రయమిచ్చే పొలం గట్లపై కలుపును ఎప్పటికపుడు తొలగించాలి. పొలంలో రెండు మీటర్ల కాలిబాట తీస్తే వ్యాప్తి తగ్గుతుంది. మంచు వాతావరణంలో పైరుకు తక్కువ మోతాదులో యూరియా వాడాలి.

● అవసరమనుకుంటే పొటాషియ నైట్రేట్(18-0-45) నీటితో కరిగే ఎరువును (లీటరు నీటికి 5గ్రాములు) స్ప్రే చేయవచ్చు.

● పొట్ట దశలో కూడా వ్యవసాయాధికారుల సూచనల మేరకు ఎకరాకు 20 కిలోల పొటాష్ వేయవచ్చు.

● సేంద్రియ పద్ధతిలో పుల్లటి మజ్జిగ, వేప లేదా మారేడు ఆకుల కషాయం స్ప్రే చేస్తే తెగులు ఉధృతి తగ్గుతుంది.

● రసాయన పద్ధతిలో తొలి దశలో బావిస్టిన్ లీటరు నీటికి 1.5గ్రాములు, లేదా కాసుగా మైసిన్ లీటరు నీటికి 3మి.లీ. స్ప్రే చేయవచ్చు.

● తెగులు ఎక్కువగా ఉంటే ట్రైసైక్లోజోల్ లీటరు నీటికి 0.6గ్రాములు, లేదా ఫ్యూజీ-ఒన్ లీటరు నీటికి 1మి.లీ. లేదా అమిస్టార్ లీటరుకు 1మి.లీ. స్ప్రే చేయాలి.

## పీఎంఎఫ్ఎంఈ రిసోర్స్ పర్సన్స్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(విద్య), జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ పథకం (పీఎంఎఫ్ఎంఈ) అమలు చేసేందుకుగాను మండల స్థాయిలో రిసోర్స్ పర్సన్స్ ఉద్యోగాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.శోభన్‌బాబు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అయితే ఇది నెలవారీ స్థిరమైన వేతనం ఉన్న ఉద్యోగం కాదని, ఇన్సెంటివ్ ఆధారిత ఎంపానల్మెంట్ ప్రక్రియ అని వివరించారు. ఏదేని డిగ్రీ చదివి 21-30 సంవత్సరాల మధ్య వయసుగల మహిళ, పురుష, ట్రాన్స్‌జెండర్ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు. అభ్యర్థులు చక్కటి తెలుగు భాష మాట్లాడగలిగి, కంప్యూటర్ పరిజ్ఞానంతోపాటు క్షేత్రస్థాయిలో లబ్ధిదారులను మొబిలైజేషన్ చేయగలిగిన సామర్థ్యం కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో లేదా గ్రామీణాభివృద్ధి రంగంలో పనిచేసిన అనుభవం కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న అభ్యర్థులకు సీడాప్ ఆధ్వర్యంలో రాత పరీక్ష, ఇంటర్వ్యూలద్వారా ఎంపిక ప్రక్రియ ఉంటుందని చెప్పారు. శిక్షణ అనంతరం రిసోర్స్ పర్సన్స్ ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ పథకం గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించి లబ్ధిదారులను గుర్తించాలని, వారు పరిశ్రమల స్థాపనకు అన్నివిధాల తోడ్పాటు అందించినందుకుగాను ప్రతీ యూనిట్‌కు రూ.10 వేల చొప్పున ఇన్సెంటివ్‌ను ఏపీఎఫ్‌పీఎస్ అందజేస్తుందని వెల్లడించారు.

## వైకుంఠద్వార దర్శన టోకెన్ల జారీ పూర్తి

తిరుమల, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : తిరుమల శ్రీవారి ఆలయంలో ఈనెల 10 నుంచి 19వ తేదీ వరకు జరుగుతున్న వైకుంఠద్వార స్లాటెడ్ సర్వదర్శన టోకెన్ల జారీ ప్రక్రియ శుక్రవారంతో ముగిసింది. 9వ తేదీ ఉదయం 5 గంటలకు తొలి మూడు రోజుల టోకెన్లను జారీ చేస్తామని, ఆ తర్వాత ఏ రోజుకారోజు జారీ చేస్తామని టీటీడీ ప్రకటించినప్పటికీ 8వ తేదీ రాత్రి జరిగిన తొక్కిసలాట ఘటన నేపథ్యంలో 8వ తేదీ రాత్రి నుంచే టోకెన్ల జారీ ప్రక్రియను మొదలుపెట్టారు. ఆ తర్వాత రద్దీ పెరుగుతున్న క్రమంలో మిగిలిన రోజులకు సంబంధించిన టోకెన్ల జారీని కూడా 11వ తేదీ రాత్రి నుంచి మొదలుపెట్టారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయానికి టోకెన్ల జారీ ప్రక్రియ పూర్తయింది. కాగా, 20వ తేదీకి సంబంధించి స్లాటెడ్ సర్వదర్శన టోకెన్లు జారీ చేసేది లేదని, ఆరోజు శ్రీవారిని దర్శించుకోవాలనుకునే భక్తులు నేరుగా తిరుమలకు వెళ్లి టోకెన్ రహిత దర్శన కేటగిరీలో దర్శించుకోవాలని టీటీడీ ప్రకటించింది. రద్దీ నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. ఇక, వీఐపీ బ్రేక్ దర్శనాలను కూడా 20వ తేదీకి కేవలం ప్రొటోకాల్‌కే పరిమితం చేసింది.

# 'సౌర' రిజిస్ట్రేషన్లకు రెస్కో కసరత్తు

● సిబ్బందికి శిక్షణ కార్యక్రమానికి శ్రీకారం

కుప్పం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు కుప్పంలో ప్రారంభించిన ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు సోలరైజేషన్ ప్రక్రియను వంద శాతం పూర్తి చేయడానికి కుప్పం గ్రామీణ విద్యుత్తు సహకార సంస్థ (రెస్కో) కసరత్తు ప్రారంభించింది. ఇంటింటికీ సిబ్బందిని పంపి సౌర విద్యుత్తుకు సంబంధించిన సూర్యఘర్ పథకం రిజిస్ట్రేషన్లు చేయించడానికి చర్యలు తీసుకుంటోంది. ఇందుకు తగిన శిక్షణను సిబ్బందికి ఇచ్చే కార్యక్రమానికి శుక్రవారం శ్రీకారం చుట్టింది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈనెల 6, 7 తేదీలలో కుప్పంలో పర్యటించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆయన సుమారు రూ.555 కోట్లు విలువ చేసే వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రారంభించడమే కాదు, శంకుస్థాపనలు కూడా చేశారు. ఇందులో సోలరైజేషన్ కార్యక్రమం ప్రథమ స్థానంలో ఉంది. కుప్పం మండం నడిమూరు గ్రామంలో ఈనెల 6వ తేదీన ముఖ్యమంత్రి సోలరైజేషన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. రాష్ట్రంలోనే మొట్టమొదటగా సోలరైజేషన్ కార్యక్రమానికి పైలెట్ ప్రాజెక్టుగా కుప్పం నియోజకవర్గాన్ని ఎంచుకున్న ఆయన, తొలుత ప్రయోగాత్మకంగా నడిమూరులో 20 ఇళ్లకు అమర్చిన సౌర విద్యుత్తు ఫలకాలను ఆవిష్కరించారు. అంతేకాదు, ఆయా కుటుంబాలలోని వ్యక్తులను పలకరించి, సౌర విద్యుత్తు వల్ల వారు ఏ రీతిగా ఉచిత విద్యుత్తును పొందగలరో వివరించారు. కడా పీడీ వికాస్ మర్మత్, రెస్కో ఎండీ సోమశేఖర్ తదితర అధికార యంత్రాంగం దీనికి ముందస్తుగా అవసరమైన ఏర్పాట్లు సిద్ధం చేసిపెట్టింది. సీఎం పర్యటనకు ముందు కేవలం నెలా రెండు నెలల వ్యవధిలో సోలార్ విద్యుత్తు ఏర్పాట్లకు అవసరమైన సర్వేలన్నీ రెస్కో పూర్తి చేసింది. రెస్కో పరిధిలో 1.3 లక్షల విద్యుత్తు సర్వీసులున్నాయి. నియోజకవర్గ పరిధిలో రెస్కో సర్వే ద్వారా గుర్తించిన 53,314 గృహాలకు రూఫ్‌టాప్ ఉన్నట్లు గుర్తించారు. ఈ గృహాలన్నింటికీ కలిపి 2,66,15,521 చదరపు అడుగుల్లో సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేయడానికి వీలుపడుతుందని కూడా సర్వేలో తేల్చారు. నియోజకవర్గం మొత్తాన్ని వంద శాతం సోలరైజేషన్ చేయాలన్నది ముఖ్యమంత్రి ప్రకటిత లక్ష్యం.

● **సూర్యఘర్ రిజిస్ట్రేషన్లకు కసరత్తు:** సోలరైజేషన్ అన్నది కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన సూర్యఘర్ పథకంతో అనుసంధానమైనది. సోలార్ విద్యుత్తు పెట్టుకునే లబ్ధిదారులకు అందుకు అయ్యే వ్యయంలో 60 శాతం కేంద్ర ప్రభుత్వం భరిస్తుంది. మిగిలిన 40 శాతాన్ని లబ్ధిదారుడు పెట్టుకోవాల్సి ఉంటుంది. కుప్పంలో పైలెట్‌గా ప్రకటించిన సోలరైజేషన్ కార్యక్రమం వంద శాతం ఉచితంగా లబ్ధిదారులకు అందిస్తామని ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. అంటే లబ్ధిదారులు చెల్లించాల్సిన 40 శాతాన్ని రాష్ట్ర ప్రభుత్వమే సమకూర్చి, సోలార్ విద్యుత్తు అందిస్తుంది. ఏది జరగాలన్నా ముందుగా సూర్యఘర్ పథకంలో ప్రజలు తమ పేర్లను రిజిస్ట్రేషన్ ప్రక్రియ ద్వారా నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ పథకంపై ఇంత దాకా ఎవరికీ సరైన అవగాహన లేకపోవడంవల్ల రెస్కోనే ఈ బాధ్యత తీసుకోవడానికి ముందుకొచ్చింది. అందుకోసం సూర్యఘర్ పథకంలో రిజిస్ట్రేషన్ విధానంపై తమ సిబ్బందికి ముందుగా శిక్షణ ఇవ్వడానికి ఉపక్రమించింది. దీనికి సంబంధించి మొదటి బ్యాచ్ శిక్షణ శుక్రవారం జరిగింది. ఇలా ఒకటిరెండు రోజులు బ్యాచ్‌లవారీగా శిక్షణ ఇచ్చిన తర్వాత, సిబ్బందిని ఇంటింటికీ పంపి, వారి ద్వారా ప్రజల పేర్లను సూర్యఘర్ పథకంలో నమోదు చేయించడానికి నిర్ణయించారు. గృహస్థుల మొబైల్ ఫోన్ల ద్వారానే రెస్కో సిబ్బంది వారి పేర్లను రిజిస్ట్రేషన్ చేయించేలా కార్యక్రమాన్ని రూపొందించారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాలలో ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయడానికి ప్రాథమికంగా నెల రోజులు గడువుగా నిర్ణయించారు. ఇంటింటికీ వెళ్లే రెస్కో సిబ్బంది సూర్యఘర్ పథకంలో పేర్లను నమోదు చేయించడంతోపాటు విద్యుత్తు బకాయిల వసూళ్లు, రెగ్యులరైజేషన్ ఆఫ్ ఓవర్‌లోడ్స్‌పై కూడా దృష్టిపెట్టి, ఆపని కూడా వంద శాతం పూర్తయ్యేలా చూడాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. తొలుత పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టిన కుప్పం నియోజకవర్గంలో సత్ఫలితాలనిస్తే రాష్ట్రమంతటా సోలరైజేషన్‌ను విస్తరించడానికి ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయించారు. దీనిపై రెస్కో ఎండీ సోమశేఖర్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా, ఒకటిరెండు రోజుల్లో తమ సిబ్బంది ఇంటింటికీ వచ్చి సూర్యఘర్ పథకానికి సంబంధించి రిజిస్ట్రేషన్లు చేయిస్తారని చెప్పారు. నెలరోజుల్లోగా ఈ రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో తదుపరి దశ మొదలవుతుందని తెలిపారు.



నడిమూరులో ఈ నెల 6వ తేది సోలరైజేషన్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న చంద్రబాబు

## ఎల్లుండి నుంచి లెప్రసీ సర్వే

చిత్తూరు రూరల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఇంటింటి లెప్రసీ గుర్తింపు సర్వే ఈనెల 20 తేదీనుంచి నిర్వహించాలని జిల్లా లెప్రసీ నివారణ అధికారి వెంకటప్రసాద్ తెలిపారు. శుక్రవారం చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలోని జిల్లా లెప్రసీ నివారణ అధికారి కార్యాలయం నుంచి వర్చువల్‌గా సర్వేపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. స్పర్శలేని, గోధుమ రంగు మచ్చలు, చర్మం మందంగా ఉండడం వంటివి కూడా లెప్రసీకి సూచికలేనన్నారు. అలాంటి వారిని గుర్తించిన వెంటనే టెస్టులు చేయించాలని సూచించారు. ఈ రోగులకు ప్రభుత్వం ఉచితంగా మందులు అందిస్తుందని చెప్పారు.

## అమరరాజా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

తవణంపల్లె, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): తవణంపల్లె మండలంలోని దిగువమాఘంలో అమరరాజా సంస్థ చేయూతతో రాజన్న ట్రస్టు ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన అమరరాజా స్కిల్ డెవలప్మెంట్ సెంటరులో శిక్షణ కోసం నిరుద్యోగుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. మొదటి బ్యాచ్ కోసం టెన్త్, ఇంటర్ పాస్ లేదా ఫెయిలైన యువతీ యువకులు దరఖాస్తు చేసుకోవచ్చని నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 20వ తేదీనుంచి సెంటరులో ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. ఎంపికైనవారికి సర్ఫేస్ మౌంట్ టెక్నాలజీ, పీసీబీ అసెంబ్లింగ్ ఆపరేటర్ కోర్సుల్లో మూడు నెలలపాటు ట్రైనింగ్ సెంటర్ వద్ద, 21 నెలలు కంపెనీలో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ కాలంలో రూ.12,072 ఉపకార వేతనం ఇస్తామని తెలిపారు.

## వరసిద్ధుడి దర్శనానికి 3 గంటలు



స్వామి దర్శనార్థం క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

ఐరాల(కాణిపాకం), జనవరి 17 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి శుక్రవారం భక్తులు పోటెత్తారు. క్యూలైన్లు పూర్తిగా నిండి పోయాయి. దీంతో స్వామి దర్శనానికి సుమారు మూడు గంటల సమయం పట్టింది. క్యూలైన్లలో భక్తుల దాహార్తిని తీర్చడానికి ఆలయ సిబ్బంది తాగునీరు అందించారు. ప్రతి భక్తుడికీ స్వామి దర్శనం కల్పించడానికి అధికారులు కృషి చేశారు.

## ఎస్ఎస్ ఏపీసీ బాధ్యతల స్వీకరణ



వెంకటరమణకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎస్టీయూ నాయకులు

చిత్తూరు సెంట్రల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ (ఎస్ఎస్ ఏపీసీ)గా మద్దిపట్ల వెంకటరమణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు కలెక్టర్ సుమిత్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కాగా, బాధ్యతలు స్వీకరించిన వెంకటరమణకు సిబ్బంది, ఎస్టీయూ అసోసియేట్ రాష్ట్ర అధ్యక్షుడు గంటా మోహన్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మదన్‌మోహన్‌రెడ్డి, బి.మోహన్, నాయకులు యువరాజు, చిట్టిబాబు తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

## అందరి సమస్యలు పరిష్కరిస్తాం

● ఏపీటీడీసీ చైర్మన్ నూకసాని బాలాజి



టూరిజం చైర్మన్‌కు సమస్యలను విన్నవిస్తున్న ఉద్యోగులు

తిరుపతి అర్బన్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): రాతపూర్వకంగా ఇవ్వండి.. అందరి సమస్యలు పరిష్కరిస్తామని ఏపీటీడీసీ చైర్మన్ నూకసాని బాలాజీ టూరిజం ఉద్యోగులకు హామీ ఇచ్చారు. తిరుమల, తిరుపతి పర్యటనకు వచ్చిన ఆయన శుక్రవారం సాయంత్రం అలిపిరి వద్ద అసంపూర్తిగా ఉన్న టూరిజం గెస్ట్‌హౌస్‌ను పరిశీలించి, అసంతృప్తి చెందారు. అనంతరం జూపార్కు రోడ్డులో ఉన్న ఏపీటీడీసీ ట్రాన్స్‌పోర్ట్‌కు చేరుకుని అక్కడ పాడైన దాదాపు 12 బస్సులు, ఇతర యంత్రాలను చూసి అసహనం చెందారు. స్క్రాబ్‌కు తరలించి సొమ్ము చేసుకోకుండా ఇలా వదిలేశారేమిటని ప్రశ్నించారు. అధికారులు కల్పించుకొని టెండర్లు పిలిచామని, త్వరలో పూర్తి చేస్తామని సర్దుబాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీవారి దర్శన ప్యాకేజీ బస్సులు నడుపుతున్న డ్రైవర్ల బృందం మాట్లాడుతూ... గత నెలన్నర రోజులుగా ఖాళీగా ఉంటున్నామని, ఇతర రాష్ట్రాల మాదిరిగా సాధారణ టూరిజం ప్యాకేజీలకు అనుమతి ఇవ్వాలని కోరారు. పక్కన పెట్టేయడం వల్ల బస్సులు పాడైపోతున్నట్లు ఆయన దృష్టికి తెచ్చారు. ఆ తరువాత స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ కాలేజీకి సంబంధించిన టీచింగ్, నాన్‌టీచింగ్ ఉద్యోగులు తమకు సకాలంలో జీతాలు ఇవ్వడం లేదని, నెలలు తరబడి పెండింగ్‌లో ఉన్నాయన్నారు. పలు సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. ఇందుకు స్పందించిన ఆయన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ మేనేజర్ సీహెచ్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## నేడు తిరుపతికి ప్రొఫెసర్ హరగోపాల్

'వెంటాడే జ్ఞాపకాలు' పుస్తకావిష్కరణ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 17(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పౌర హక్కుల నేత, హైదరాబాదు సెంట్రల్ యూనివర్సిటీ రిటైర్డు ప్రొఫెసర్ జి.హరగోపాల్ శనివారం తిరుపతికి రానున్నారు. సీహెచ్ శివారెడ్డి రాసిన వెంటాడే జ్ఞాపకాలు పుస్తకావిష్కరణ సభలో ఆయన పాల్గొంటారు. సాయంత్రం 5 గంటలకు పద్మావతిపురంలో ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. ఈ సభలో శ్వేత మాజీ డైరెక్టర్ భూమన్, మాజీ మంత్రి పెద్దిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే భూమన పాల్గొంటారు.

## ప్రయాగ్‌రాజ్‌లో గంగాహారతి సమర్పణ



తిరుమల, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మహాకుంభమేళా సందర్భంగా ప్రయాగ్‌రాజ్‌లోని దశాశ్వమేధ ఘాట్‌లో అర్చకులు శుక్రవారం సాయంత్రం గంగగంగాహారతి సమర్పించారు. ముందుగా శ్రీవారి నమూనా ఆలయం నుంచి శ్రీనివాసస్వామిని దశాశ్వమేధ ఘాట్ వద్దకు మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్చారణల నడుమ వేంచేపు చేసి గంగానదీ తీరంలో హారతి సమర్పించారు. ఈ కార్యక్రమంలో శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాల దీక్షితులు, డిప్యూటీ ఈవో గుణభూషణ్‌రెడ్డి పాల్గొన్నారు.

# సబ్సిడీ రుణాల పంపిణీలో బ్యాంకర్లు సహకరించాలి : కలెక్టర్



సమావేశంలో ప్రసంగిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు సెంట్రల్, జనవరి17(ఆంధ్రజ్యోతి): బీసీ, ఎస్సీ కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ రుణాలను వందశాతం పంపిణీ చేసేలా బ్యాంకర్లు సహకరించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ కోరారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బీసీ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీలు, బ్యాంకర్లతో కలిసి స్పెషల్ డిస్ట్రిక్ట్ కన్సల్టేటివ్ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. 2024-25 వార్షిక ప్రణాళికలో భాగంగా బీసీలకు 2,800, ఎస్సీలకు 678 యూనిట్ల మంజూరుకు చర్యలు చేపట్టాలన్నారు. బీసీ, ఎస్సీ వర్గాల జీవనోపాధులు మెరుగుపర్చడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషిచేస్తోందని స్పష్టం చేశారు. ఎంఎస్ఎంఈ కింద యూనిట్‌లో కనీసం మూడు నుంచి ఐదుగురు సభ్యులు ఉండేలా చూడాలని, ప్రతి సబ్సిడీని మూడు శ్లాబ్‌లుగా విభజించి అందించాలన్నారు. వ్యవసాయం, పశుపోషణ, మోటారు వాహనాల విభాగం, పరిశ్రమల స్థాపన, వ్యాపారం ఇతర సేవలకు రుణాలు మంజూరు చేస్తామన్నారు. బీసీ, ఎస్సీ కార్పొరేషన్ల ఈడీలు శ్రీదేవి, రాజ్యలక్ష్మి, జడ్పీ సీఈవో రవికుమార్‌నాయుడు, డీఎల్‌డీవో రవికుమార్, బ్యాంకు ప్రతినిధులు పాల్గొన్నారు.

# పొలాలపై ఏనుగుల దాడి

పంటలకు తీవ్ర నష్టం కల్గించాయని రైతుల ఆవేదన



ఏనుగులు విరిచేసిన అరటి చెట్లు - వరి పంటలో ఏనుగుల పాదముద్రలు

బంగారుపాళ్యం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): బంగారుపాళ్యం మండలంలోని బోడబండ్ల అటవీప్రాంతానికి సమీపంలో ఉన్న పొన్నెపాళ్యం, జంబునేరుడుపల్లె పంట పొలాలపై గురువారం రాత్రి ఏడు ఏనుగుల గుంపు దాడి చేశాయి. పంటలకు తీవ్ర నష్టం కల్గించాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పొన్నెపాళ్యంకు చెందిన రాజమ్మ పొలాలపైపడి అరటి, మామిడి, కొబ్బరి చెట్లను విరిచేశాయి. వరి పంటను తొక్కినాశనం చేశాయి. ఏనుగుల దాడుల విషయాన్ని అటవీ శాఖాధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. అప్పులు చేసి సాగు చేసిన పంటలను ప్రతి ఏడాదీ ఏనుగుల దాడుల్లో కోల్పోతున్నామని వాపోయారు. ఏనుగుల గుంపు పాతూరుబండ వద్ద తిష్ఠ వేశాయని, అక్కడి నుంచి వాటిని అటవీ ప్రాంతంలోకి మళ్లించేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. అలాగే ఏనుగుల దాడుల నుంచి తమకు శాశ్వత పరిష్కారం చూపాలని వేడుకుంటున్నారు.

# నేటి నుంచి ఫ్లెమింగో ఫెస్టివల్

సూళ్లూరుపేటలో ఏర్పాట్లు పూర్తి




అటకానితిప్ప పర్యావరణ విజ్ఞాన కేంద్రం వద్ద ఆహ్వానం పలుకుతూ ఏర్పాటు చేసిన ఫ్లెమింగో సైకత శిఖరం

సూళ్లూరుపేట / తడ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో సంక్రాంతి, ఏటి పండుగ ముగియగానే పక్షుల సంబరాలు వచ్చేశాయి. పులికాట్, నేలపట్టులకు వచ్చే వలస పక్షుల ప్రాముఖ్యతను తెలుపుతూ శనివారం నుంచి మూడు రోజులపాటు పక్షుల పండగ అంగరంగ వైభవంగా జరగనుంది. ఇందుకోసం జిల్లా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. శనివారం ఉదయం 10 గంటలకు రాష్ట్ర టూరిజం, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ జూనియర్ కళాశాల మైదానంలో ఈ ఉత్సవాలను ప్రారంభించనున్నారు. ఉదయం చెంగాళమ్మ ఆలయం నుంచి శోభాయాత్రలో మంత్రులు పాల్గొని కళాశాల మైదానంలో జరిగే ప్రారంభోత్సవంలో పాల్గొంటారు. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీతో కలిసి కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ శుక్రవారం ఏర్పాట్లను పరిశీలించారు. కళాశాల మైదానంలో స్టేజీ, స్టాల్స్, డిజిటల్ గ్యాలరీలు సిద్ధం చేశారు. భీములవారిపాళెంలో పడవషికారుకు 35 పడవలను సిద్ధం చేశారు. లైఫ్ జాకెట్‌లు, గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచారు. అక్కడే స్టేజీ నిర్మించి స్థానిక కళాకారుల ద్వారా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అటకానితిప్ప, శ్రీసిటీలలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. అడిషనల్ ఎస్పీ ఆధ్వర్యంలో ఇద్దరు డీఎస్పీలు, ఆరుగురు సీఐలు, 22 మంది ఎస్ఐలతో సహా 400 మందితో భద్రతా ఏర్పాట్లు చేశారు. పర్యాటకులను అటకానితిప్ప, నేలపట్టు, భీములవారిపాళెంలకు తీసుకువెళ్లేందుకు ఆర్టీసీ బస్సులతో పాటు కొన్ని ప్రైవేట్ బస్సులను ఏర్పాటు చేశారు.

### వలస పక్షులకు ఆహ్వానం పలుకుతూ..

ఏటా శీతాకాలంలో పులికాట్ సరస్సు, నేలపట్టు ప్రాంతాలకు వలస వచ్చే విదేశీ విహంగాలకు ఆహ్వానం పలుకుతూ వాటి విశిష్టతను తెలియజేసేందుకు 2001లో తొలిసారిగా పక్షుల పండగకు అప్పటి టీడీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అప్పటి ఉమ్మడి నెల్లూరు కలెక్టర్ ప్రవీణ్ కుమార్ నేతృత్వంలో ఈ పండగ నిర్వహించారు. పులికాట్‌కు వచ్చే వలస పక్షుల్లో అరుదైన ఫ్లెమింగో పేరుతో ఈ పండగను ఏటా నిర్వహించేలా చర్యలు తీసుకున్నారు. అనంతరం వచ్చిన ప్రభుత్వాలు కూడా ఈ పండగను అట్టహాసంగా చేస్తూ వచ్చాయి. వైసీపీ అధికారంలోకి వచ్చిన తొలి ఏడాది చేసి తర్వాత ఆపేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ ఫెస్టివల్‌ను అట్టహాసంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంది. ఈ ఏడాది మొత్తం 5 చోట్ల పండగ నిర్వహిస్తున్నారు. నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రం, సూళ్లూరుపేట జూనియర్ కళాశాల మైదానం, అటకానితిప్ప పర్యావరణ విజ్ఞాన కేంద్రం, బీవీపాలెం, శ్రీసిటీలో నిర్వహించేందుకు జిల్లా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది.

## 21న ఎస్సీ వర్గీకరణ కమిషన్ రాక

చిత్తూరు సెంట్రల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై విచారణ చేయడానికి రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలోని ఏకసభ్య కమిషన్ ఈనెల 21వ తేదీన జిల్లాకు రానున్నటు కలెక్టర్ సుమిత్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 21న ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం, 11 గంటలకు ప్రజా ఫిర్యాధుల విభాగంలో ఎస్సీ కులానికి చెందిన సంఘ నేతలు, పౌరుల నుంచి వర్గీకరణపై సిఫార్సులు, అభిప్రాయాలు, అర్జీల స్వీకరణ ఉంటుంది. కమిషన్‌కు నివేదించే వ్యక్తులు ఉమ్మడి చిత్తూరు జిల్లా వాసులుగా ఉండి, వాస్తవాలను ఒరిజనల్ ధ్రువీకరణ పత్రాలను సమర్పించాలి.

## రేపు యోగి వేమన జయంతి వేడుకలు

చిత్తూరు అర్బన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు యోగి వేమన జయంతి వేడుకలను ఆదివారం ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌లో నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి రబ్బానీ బాషా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

## శ్రీవారి భక్తుల సౌకర్యార్థం హెల్ప్‌డెస్క్




తిరుపతి రైల్వేస్టేషన్‌లో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్

తిరుపతి(సెంట్రల్), జనవరి 17 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో వైకుంఠ ద్వార దర్శనం కోసం వచ్చిన భక్తుల కోసం తిరుపతి రైల్వేస్టేషన్‌లో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారి సందేహాలను నివృత్తి చేస్తున్నారు. అలాగే ఉత్తర భారత దేశంలో ప్రారంభమైన పుష్కర స్నానాలు ఆచరించడానికి వెళ్లే భక్తులకు కమర్షియల్ విభాగం టీటీఐలు సేవలందిస్తున్నారు. ఈ కేంద్రాల్లో సిబ్బంది 24 గంటలు పనిచేస్తారని అధికారులు తెలిపారు.

## వారపు సంతలో వసతుల కరవు



కనీస సౌకర్యాలు లేని సోమల వారపు సంత

సోమల, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సోమల వారపు సంతలో కనీస సౌకర్యాలు కరవయ్యాయి. ఏటా పంచాయతీకి రూ.5 లక్షలు మించి వేలంతో ఆదాయం వస్తోంది. కొన్నేళ్లుగా పుంగనూరు-సదుం రోడ్డు పక్కనే చింతచెట్టు నీడనే వారపు సంత ప్రతి శనివారం జరుగుతుంది. వారపు సంతలో వ్యాపారులు దుకాణాలు ఏర్పాటు చేసుకునేందుకు షెడ్లు లేకపోవడంతో నేలపైనే వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. కలికిరి, సదుం, పుంగనూరు, చౌడేపల్లె, కందూరు, కల్లూరు ఇతర మండలాల నుంచి వచ్చే వ్యాపారులకు కనీస తాగునీటి సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. వారపు సంతలోని రోడ్డు వర్షాకాలంలో బురదమయం అవుతుంది. ప్రతి శనివారం పుంగనూరు రోడ్డు జనసందడిగా మారి రాకపోకలు స్తంభించిపోతుంటాయి. వారపు సంతలో దుకాణాలకు స్థలం లేకపోవడంతో రోడ్డుపైనే ఏర్పాటు చేసుకుంటున్నారు. అలాగే కందూరు, నంజంపేట, పెద్దఉప్పరపల్లెలో జరిగే వారపు సంతలకు సొంత స్థలాలు కూడా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి కనీస సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.

## పారదర్శకంగా ఆలయ భూముల వేలం



దేవదాయశాఖ అధికారులను నిలదీస్తున్న టీడీపీ నాయకులు, ప్రజలు

కల్లూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): దేవుడి భూములకు సంబంధించి ఎలాంటి రాజకీయాలకు తావులేకుండా పారదర్శకంగా ఉండాలని రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గం టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి లెక్కల ధనంజయ నాయుడు, మండల టీడీపీ కార్యదర్శి బండ్ల రమేష్ తెలిపారు. పులిచెర్ల మండలం దేవళంపేట లక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి సుమారు 13.87 ఎకరాలు భూములు ఉన్నాయి. ఈ భూములకు సంబంధించి ఈనెల 17న శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు కౌలు వేలం నిర్వహించాలని ఆలయ కార్యనిర్వహణాధికారి యువరాణి నిర్ణయించారు. ఈ మేరకు లక్ష్మీ నరసింహస్వామి ఆలయం వద్దకు శుక్రవారం ఉదయం 11 గంటలకు ఆమెతో పాటు టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ఫణిరాజ్, జూనియర్ అసిస్టెంట్ ప్రకాష్ చేరుకుని వేలం నిర్వహించేందుకు సమాయత్తమయ్యారు. ఆలయ భూములున్న అయ్యావాండ్లపల్లి, కల్లూరు, దేవళంపేట, బోడిరెడ్డిగారిపల్లి గ్రామాలకు చెందిన కొందరు గ్రామస్తులు టీడీపీ నాయకులతో కలిసి అక్కడకు చేరుకున్నారు. ప్రజలకు ముందస్తు సమాచారం లేకుండా నిర్వహిస్తున్న వేలం వాయిదా వేయాలని కోరారు. దండోరా రూపంలో ప్రజలకు సమాచారం ఇచ్చినట్లు ఆధారాలుంటే చూపాలని ఎండోమెంట్ అధికారులను నిలదీశారు. దీంతో కార్య నిర్వహణాధికారి యువరాణి మాట్లాడుతూ ఆలయ భూముల కౌలు వేలం విషయంలో ముందస్తు సమాచారం లేదని అభ్యంతరాలు రావడంతో వేలం వాయిదా వేస్తున్నామన్నారు. గ్రామాల్లో దండోరా వేయించి ప్రజలకు తెలియజేస్తామని, ఈనెల చివరికి తిరిగి వేలం నిర్వహిస్తామని తెలిపారు.

## మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం హరి

రొంపిచెర్ల, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాల్లోని మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని ఏపీఎం హరి కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని స్త్రీ శక్తి భవనంలో గ్రామ సమాఖ్యలతో సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయం సహాయక సంఘలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థిక స్వావలంబన సాధించాలన్నారు. తీసుకున్న రుణాలు పక్కదారి పట్టకుండా వినియోగించుకోవాలన్నారు. ఎవరైనా అవినీతి చర్యలకు పాల్పడితే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో సీసీ రమేష్, ఉమాదేవి తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## కుష్ఠువ్యాధిపై అవగాహన అవసరం




అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య విద్యాధికారి సావిత్రి

బైరెడ్డిపల్లె, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెలుగు మహిళా సమాఖ్య కార్యాలయంలో శుక్రవారం గ్రామ సమాఖ్య లీడర్లకు కుష్ఠువ్యాధి నివారణపై బైరెడ్డిపల్లె పీహెచ్‌సీ ఆరోగ్య విద్యాధికారి సావిత్రి అవగాహన కల్పించారు. శరీరంపై నొప్పిలేని మచ్చలు కనిపిస్తే వైద్యపరీక్షలు చేసుకుని నిర్ధారించుకోవాలన్నారు. తగిన మందులు వాడి పోషకాహారం తీసుకోవాలని సూచించారు. పరిశుభ్రత, సీజనల్ వ్యాధుల నివారణపై వివరించారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం లలిత, వసంత, సమాఖ్య లీడర్లు పాల్గొన్నారు.

## మామిడిచెట్ల తొలగింపుపై పోలీసులకు ఫిర్యాదు

కల్లూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం 102 రామిరెడ్డిగారి పల్లి రెవెన్యూ గ్రామంలోని తన భూమిలో 25 ఏళ్లక్రితం నాటిన సుమారు 30 మామిడిచెట్లను రొంపిచెర్ల మండలం కొండ్రెడ్డిగారిపల్లికి చెందిన మధుసూదన్ రెడ్డి జేసీబీతో తొలగించినట్లు తిరుపతికి చెందిన రామకృష్ణమనాయుడు భార్య రాధ శుక్రవారం కల్లూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలి కథనం మేరకు.. తనకున్న 5.30 ఎకరాల వ్యవసాయ భూమిలో 25 ఏళ్ల క్రితం మామిడి మొక్కలు నాటి ఫలసాయం పొందుతున్నారు. ఆమె మామిడి తోటకు పడమర వైపున మధుసూదన్‌రెడ్డికి చెందిన భూమి ఉంది. ఈనెల 16న ఆమెకు చెందిన తోటలోని 30 మామిడిచెట్లను మధుసూదన్‌రెడ్డి జేసీబీతో తొలగించి భర్తకు ఫోన్ చేసి బెదిరించాడని తెలిపారు. దీంతో పొలం వద్దకు చేరకుని మధుసూదన్‌రెడ్డి గుమస్తా సుబ్రమణ్యం తదితరులను ప్రశ్నించగా తమపై దురుసుగా ప్రవర్తించారని.. దీనిపై న్యాయం చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కల్లూరు ఎస్ఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మామిడిచెట్లు తొలగింపుపై విచారణ చేపడుతున్నామని తెలిపారు.

## ఆర్జేడీ శామ్యూల్‌కు సత్కారం



పుంగనూరు రూరల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ జిల్లాల ప్రాంతీయ విద్యా సంచాలకులు (కడప)గా బాధ్యతలు తీసుకున్న కె.శామ్యూల్‌ను పుంగనూరు రాయలసీమ చిల్డ్రన్స్ అకాడమి పాఠశాల డైరెక్టర్ చంద్రమోహన్‌రెడ్డి, మదనపల్లె విజయభారతి స్కూల్ కరస్పాండెంట్ సేతు శుక్రవారం కలిసి శాలువతో సత్కరించారు. కడప ఆర్జేడీ కార్యాలయంలో ఆయన్ను కలిసి ప్రైవేటు పాఠశాలలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించినట్లు వారు తెలిపారు.

## వైష్ణవీదేవికి అభిషేకాలు

చౌడేపల్లె, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): పుదిపట్లలో వెలసిన వైష్ణవిదేవికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ నిర్వాహకులు వినోద్‌కుమార్‌రెడ్డి, శ్రావణి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

## కుప్పనపల్లెలో తాగునీటి కష్టాలు



ఖాళీ బిందెలతో మహిళల నిరసన

బైరెడ్డిపల్లె, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుప్పనపల్లె గ్రామంలోని దళిత వాడలో తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని.. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు వాపోయారు. తమ కాలనీలో రక్షిత మంచి నీటి బోరు లేకపోవడంతో సమీప వ్యవసాయ బావులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఆరు నెలలుగా సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాలేదని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్య తీర్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## టీడీపీపై రాష్ట్ర ప్రజలకు విశ్వాసం: గౌనివారి

శాంతిపురం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): టీడీపీపై రాష్ట్ర ప్రజల్లో విశ్వాసం పెరిగిందని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. టీడీపీ సభ్యత్వ నమోదు కోటి దాటడమే ఇందుకు నిదర్శమని ఆయన పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు పరిపాలన దక్షత, మంత్రి నారా లోకేశ్ కార్యకర్తల సంక్షేమానికి తీసుకున్న విప్లవాత్మక చర్యలను ప్రజలు హర్షిస్తున్నారని తెలిపారు. అందుకే పార్టీ సభ్యత్వ నమోదుకు ప్రజల నుంచి విశేష స్పందన లభించిందన్నారు. రాష్ట్రంలో ప్రతి నలుగురిలో ఒకరు టీడీపీ సభ్యుడు అని చెప్పుకోవడం గర్వకారణమన్నారు. రాష్ట్ర ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్రం అభివృద్ధికి, పేదల సంక్షేమానికి చిత్తశుద్ధితో కృషి చేస్తోందని తెలిపారు.

## ఏపీసీని కలిసిన ఎస్టీయూ నేతలు



ఏపీసీని కలిసిన ఎస్టీయూ నేత గురవయ్యానాయుడు తదితరులు

కుప్పం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా అసిస్టెంట్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వెంకటరమణను ఎస్టీయూ జిల్లా నాయకుడు, కుప్పం మండలం అడవిబూదుగూరు హరిజనవాడ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పోతుగుంటగురవయ్యానాయుడుతోపాటు ఇతర ఎస్టీయూ నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. వారిని ఆహ్వానిస్తూ జిల్లాను నాలెడ్జ్ హబ్‌గా తయారు చేయడంలో ఏపీసీ భాగస్వామ్యం ప్రముఖంగా ఉండాలని ఆకాంక్షించారు.

## రామకుప్పం ఎంపీడీవోగా మురళీధర్‌రెడ్డి



మురళీధర్‌రెడ్డిని సత్కరిస్తున్న టీడీపీ నేతలు

రామకుప్పం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండల పరిషత్ కార్యాలయంలో పరిపాలనాధికారిగా విధులు నిర్వహిస్తున్న మురళీధర్‌రెడ్డి శుక్రవారం ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీవోగా ఉన్న లక్ష్మీకాంత్ సెలవుపై వెళ్లడంతో ఉన్నతాధికారులు మురళీధర్‌రెడ్డికి పూర్తిస్థాయి ఎంపీడీవోగా బాధ్యతలు అప్పగిస్తూ ఆదేశాలిచ్చారు. ఎంపీడీవోను టీడీపీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, మాజీ ఎంపీపీ ఆంజనేయరెడ్డి ఆధ్వర్యంలో సత్కరించారు. కార్యక్రమంలో నేతలు మనోహర్, జయశంకర్, కామరాజనాయక్, రామకృష్ణప్ప, నందారెడ్డి, వెంకటరమణ, చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, ఆదిల్, బాలరాజు, సుబ్రీ, కుమార్, లోకేష్, అంజి, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

## కట్నం వేధింపులతో భర్తపై ఫిర్యాదు

కల్లూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం తీసుకురావాలని వేధిస్తున్న భర్త, అతడికి సహకరిస్తున్న అత్తపై ఓ మహిళ కల్లూరు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. పులిచెర్ల మండలం రేణుమాకులపల్లి పంచాయతీ ఆర్.వడ్డిపల్లెకు చెందిన మహేశ్వరికి ఇదే గ్రామానికి చెందిన రెడ్డెప్పతో 20 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరి వివాహ సమయంలో తమ తల్లిదండ్రులు తన భర్త రెడ్డెప్పకు కట్నంగా రూ.లక్ష నగదు, 30 గ్రాముల బంగారు ఇచ్చారు. అయితే తన అత్త యర్రమ్మ, భర్త రెడ్డెప్ప వేధింపులు తట్టుకోలేక ఆరేళ్ల క్రితం కువైట్‌కు వెళ్లి సంపాదించి అత్త, భర్తకు పంపించినట్లు తెలిపింది. గతేడాది ఫిబ్రవరిలో కువైట్ నుంచి అత్తారింటికి రాగా మళ్లీ వేధింపులు మొదలయ్యాని వారంక్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. ఈనెల 14న భర్త వచ్చి తనపై దాడి చేశాడని పోలీసులకు తెలిపింది. ఆ సమయంలో అడ్డొచ్చిన తన చెల్లెలు తులసి, తండ్రి అంకయ్యలపై దాడి చేసినట్లు ఫిర్యాదులో పేర్కొంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## కుప్పం టౌన్‌బ్యాంక్ పర్సన్ ఇన్‌చార్జి పదవీకాలం పొడిగింపు

కుప్పం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): కుప్పం కో ఆపరేటివ్ టౌన్ బ్యాంక్ పర్సన్ ఇన్‌చార్జి పదవీకాలం పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులిచ్చింది. కుప్పం టౌన్ బ్యాంకుకు వైసీపీ హయాంలో భాగ్యరాజ్ ప్రభంజన్ చైర్మన్‌గా బోర్డును నామినేట్ చేసింది. అయితే టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ బోర్డు రాజీనామాలు చేసింది. అప్పటి నుంచి డిస్ట్రిక్ట్ కో ఆపరేటివ్ ఆడిట్ ఆఫీసర్ కె.బ్రహ్మానందరెడ్డి కుప్పం టౌన్ బ్యాంక్‌కు పర్సన్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. ఈయన పదవీ కాలాన్ని మరో ఆరు నెలలపాటు.. తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు పర్సన్ ఇన్‌చార్జిగా కొనసాగిస్తూ ప్రభుత్వ ఎక్స్ అఫిషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్ ఉత్తర్వులు ఇచ్చారు.

## 20 నుంచి జాతీయ కుష్ఠు నిర్మూలన సర్వే

సోమల, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఈనెల 20 నుంచి జాతీయ కుష్ఠు నిర్మూలన కార్యక్రమంపై సర్వే నిర్వహించడం జరుగుతుందని పెద్దఉప్పరపల్లె వైద్యాధికారి డాక్టర్ బాలాజీ తెలిపారు. ఈక్రమంలోనే వైద్యసిబ్బందికి అవగాహన కల్పించారు. కుష్ఠు వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి సరైన వైద్య చికిత్స అందించడంతో వ్యాధి వ్యాప్తి చెందకుండా ఉంటుందన్నారు. ప్రతి పాఠశాలలో విద్యార్థులను తనిఖీ చేసి లక్షణాలు ఉంటే చికిత్స అందించడం జరుగుతుందన్నారు. ఫిబ్రవరి 2వ తేదీ వరకు సర్వే గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు, ఇంటింటి సర్వేలు చేపట్టాలని తెలిపారు.



# రూ.లక్షల ప్రజాధనం రోడ్డుపాలు..!

- సీసీ రోడ్ల నిర్మాణాల్లో లోపించిన నాణ్యత
- కంకర లేచిపోవడంతో స్థానికుల అవస్థలు
- మరమ్మతులు చేపట్టాలని వేడుకోలు
- నిధులు మంజూరు కాగానే బాగు చేస్తాం: కమిషనర్

పుంగనూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో పుంగనూరు పట్టణంలో నిర్మించిన పలు సిమెంట్ రోడ్లు నాణ్యత లోపించి గోతులు, కంకర తేలి అధ్వానంగా తయారయ్యాయి. లక్షలాది రూపాయల ప్రజాధనం రోడ్ల కోసం వ్యయం చేసినా కొద్దిరోజులకే పలు చోట్ల కంకర రోడ్లుగా దర్శనమిస్తున్నాయి. సీసీ రోడ్లుకంటే మట్టిరోడ్లే నయమనే విధంగా తయారయ్యాయి. నాటి వైసీపీ శ్రేణులు కాంట్రాక్టర్లుగా రోడ్డు పనులు చేయడంతో అధికారుల పర్యవేక్షణ లోపించడంతో నాణ్యతలేక మున్నాళ్ల ముచ్చటగా మారాయి. పుంగనూరు పట్టణంలోని ఎల్ఐసీ కాలనీ మున్సిపల్ ప్రాథమిక పాఠశాల మార్గంలో సీసీరోడ్డుపై గుంతలు, కంకర లేచిపోవడంతో దుస్థితికి చేరుకుంది. అలాగే హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు వెనుకవీధిలో ఏడాది కాకుండానే కంకర తేలిపోవడంతో రోడ్డుకు అప్పట్లో అధికారులు సిమెంటు పూతలు వేశారు. నక్కబండ కాలనీకి వెళ్లే మార్గంలో పొలాల మధ్యలో దాదాపు నాలుగు సార్లు సీసీ రోడ్డు వేసినా కొద్దిరోజులకే అధ్వానంగా మారడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి పక్కన ఉన్న ప్రకాశం కాలనీలో కంకరతేలి రోడ్డుపై కనిపిస్తోంది. అలాగే పుంగమ్మచెరువు కట్ట వద్ద పెద్దరామస్వామిగుడి వీధి, సూర్యానగర్, భగత్‌సింగ్ కాలనీ, మేలుపట్ల, కొత్తపేట తదితర ప్రాంతాల్లో సీసీ రోడ్లపై గుంతలు దర్శనమిస్తున్నాయి. దుస్థితికి చేరిన రోడ్లకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు. రోడ్ల మరమ్మతులకు.. కొత్త రోడ్ల మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని.. నిధులు రాగానే బాగు చేస్తామని కమిషనర్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు.



కొత్తయిండ్లలోని ఎల్ఐసీ కాలనీలో దుస్థితిలో ఉన్న సీసీ రోడ్డు

## రెవెన్యూ సమస్యలకు తక్షణ పరిష్కారం

- జాయింట్ కలెక్టర్ విద్యాధరి



జేసీ విద్యాధరిని సన్మానిస్తున్న రామకుప్పం టీడీపీ నాయకులు

రామకుప్పం/శాంతిపురం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చే రెవెన్యూ సమస్యల పరిష్కారంలో క్షేత్రస్థాయిలో అధికారులు అలసత్వం ప్రదర్శించరాదని.. విచారించి తక్షణ పరిష్కారం చూపాలని జిల్లా జాయింట్ కలెక్టర్ విద్యాధరి కోరారు. శుక్రవారం ఆమె కుప్పం ఆర్డీవో శ్రీనివాసరాజుతో కలిసి భూసర్వే పైలట్ ప్రాజెక్టుకు ఎంపిక చేసిన రామకుప్పం మండలం గిడ్డపల్లె, శాంతిపురం మండలంలోని పలు గ్రామాలను ఆమె సందర్శించారు. అనంతరం ఆయా మండల తహసీల్దార్లు, వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లతో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ భూసర్వే విషయంలో ఎలాంటి అభ్యంతరాలు, ఆరోపణలకు తావు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. భూసర్వే అనంతరం ఎట్టి పరిస్థితుల్లోనూ రైతుల నుంచి సమస్యలపై ఫిర్యాదు రాకూడదన్నారు. అలాగే రెవెన్యూ సదస్సుల్లో రైతుల నుంచి వచ్చిన వినతిపత్రాల్లోని సమస్యలను నిర్దేశిత గడువులోపు పరిష్కరించాలని ఆమె ఆదేశించారు. సమావేశాల్లో తహసీల్దార్లు బాబు, శివయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శాంతిపురం మండల సచివాలయంలో జేసీని టీడీపీ నేతలు విశ్వనాథనాయుడు, మంజునాథరెడ్డి, రమేష్, మురుగేష్, గోపాల్, కేశవులు, మునిరెడ్డి తదితరులు మర్యాద పూర్వకంగా కలిశారు.

### రెవెన్యూ సమస్యలపై జేసీకి వినతి

రామకుప్పం మండలంలో నెలకొన్న రెవెన్యూ సమస్యలకు పరిష్కారం చూపాలని టీడీపీ మండలాధ్యక్షుడు ఆనందరెడ్డి జాయింట్ కలెక్టరు విద్యాధరికి విన్నవించారు. శుక్రవారం రామకుప్పం తహసీల్దారు కార్యాలయానికి వచ్చిన జేసీని పార్టీ నేతలతో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా మండలంలో పలు సమస్యలను జేసీ దృష్టికి తీసుకెళ్లారు. సమస్యల పరిష్కారానికి అధికారులు నిర్లక్ష్యం చేయరాదని సిబ్బందికి సూచించారు. వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసరాజు, తహసీల్దారు బాబు, డీటీ బాలాజీ, ఆర్ఐ నారాయణప్ప, టీడీపీ నేతలు నందారెడ్డి, మనోహర్, బాలరాజు, మురళీమోహన్, మునీంద్రనాయక్ పాల్గొన్నారు.

## చేపల మార్కెట్ నిర్మాణాలు చేపట్టాలి



మాట్లాడుతున్న బెస్త సంఘం, బీజేపీ నాయకులు

పుంగనూరు రూరల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు పట్టణంలో చేపల మార్కెట్ నిర్మాణ పనులను వెంటనే చేపట్టాలని బెస్త సంఘం, బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక బీఎంఎస్ క్లబ్ ఆవరణలో వివిధ సంఘాలతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ 15 ఏళ్ల క్రితం హైకోర్టు ఉత్తర్వుల మేరకు బెస్త కులస్తుల జీవనోపాధిగా ఉన్న చేపల మార్కెట్‌ను వెంటనే నిర్మాణాలు చేపట్టాల్సి ఉండగా అధికారులు స్పందించలేదన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు గంపల గంగరాజు, షబానా, భారతి, చిట్టెమ్మ, చైత్ర, వెంకటా చలపతి, రాధాకృష్ణ, నారాయణస్వామి, నాగార్జున, రాజశేఖర్, నరసింహులు, వెంకట్, నారాయణ, సురేష్, గంగులప్ప, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## రైలు ఢీకొని పెయింటర్ మృతి



కృష్ణమూర్తి మృతదేహం

కుప్పం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండలం బంగారునత్తం సమీపంలో ప్రమాదవశాత్తు రైలు ఢీకొని కృష్ణమూర్తి అనే వ్యక్తి మృతి చెందాడు. రైల్వే హెడ్ కానిస్టేబుల్ రమేశ్ కథనం మేరకు.. కుప్పం మండలం వెండుగంపల్లెకు చెందిన కృష్ణమూర్తి పెయింటర్. ఈయనకు ఇద్దరు భార్యలు. కుటుంబ జీవనం సక్రమంగా లేకపోవడంతో మద్యానికి అలవాటు పడ్డాడు. మద్యం మత్తులో పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందాడు. కృష్ణమూర్తి మృత దేహాన్ని రైల్వే పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం కుప్పం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

### చిత్తూరులో మరో వ్యక్తి...

చిత్తూరు రూరల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): పూతలపట్టు మండలం వావిల్‌తోట వద్ద గురువారం రాత్రి రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. విల్లుపురం-తిరుపతి రైలు లోకో పైలట్ చిత్తూరు రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతి చెందిన వ్యక్తి ఉన్న లభ్యమైన ఆధారాల మేరకు సదుం మండలం చింతలవారిపల్లెకు చెందిన దేవేంద్రగా గుర్తించారు. ఇతను ఆత్మహత్యకు పాల్పడి ఉండొచ్చని రైల్వే పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతదేహాన్ని చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసినట్లు శుక్రవారం ఎస్ఐ తెలిపారు.

### చెట్టు నుంచి జారిపడి...



వెంకటస్వామి

గుడుపల్లె, జనవరి 17 (ఆంధ్ర జ్యోతి): కొబ్బరి కాయల కోసం వృద్ధుడు చెట్టెక్కి ప్రమాదవ శాత్తు జారి పడి మృతి చెందిన సంఘటన గుడుపల్లె మండలంలో జరిగింది. స్థానికుల కథనం మేరకు.. .యామగానిపల్లె గ్రామానికి చెందిన వెంకటస్వామి(64) గురువారం కొబ్బరి కాయల కోసం తన వ్యవసాయ పొలం వద్దకు వెళ్లాడు. అక్కడ చెట్టు ఎక్కడానికి నిరాకరించడంతో ఆయనే చెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తు చెట్టు నుంచి కిందకు జారిపడటంతో ఆయన తీవ్రంగా గాయపడ్డాడు. వెంకటస్వామిని కుప్పంలో ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. గురువారం రాత్రి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వెంకటస్వామి మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఐదుగురిపై అట్రాసిటీ కేసు

రామకుప్పం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): కులం పేరుతో దుర్భాషలాడి, భౌతిక దాడికి పాల్పడిన ఐదుగురిపై రామకుప్పం పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఎస్ఐ వెంకటమోహన్ కథనం మేరకు.. గురువారం 89పెద్దూరు గ్రామంలో గ్రామస్తులు పశువుల పండుగ నిర్వహించారు. స్థానిక ఎస్సీకాలనీకి చెందిన సెల్వం(72) పండుగ చూసేందుకు వచ్చాడు. స్థానిక ఎంపీటీసీ సభ్యుడు వెంకట్రాముడు అతని సోదరుడు అములు నారాయణ, అనుచరులు చరణ్‌తేజ్, ప్రకాష్, వేలు సెల్వంను తమ వీధిలోకి ఎందుకు వచ్చావంటూ కులం పేరుతో దూషిస్తూ కించపరిచేలా ప్రవర్తించారు. భౌతికంగా దాడికి పాల్పడ్డారు. అదే గ్రామానికి చెందిన మహేంద్ర, లోకేశ్, నస్రుల్లాలు సెల్వంను వారి బారి నుంచి కాపాడారు. ఈ విషయమై సెల్వం శుక్రవారం పోలీసులకు పిర్యాదు చేశారు. వెంకట్రాముడు, అములనారాయణ, చరణ్‌తేజ్, ప్రకాష్, వేలులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

### పోరాటాలతోనే హక్కుల సాధన సాధ్యం

పుంగనూరు, జనవరి 17(ఆంధ్రజ్యోతి): పోరాటాలతోనే జర్నలిస్టుల హక్కులను సాధించుకోగలమని ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు కె.జయరాజ్, జయచంద్ర పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఓ మండపంలో జరిగిన పుంగనూరు నియోజకవర్గ జర్నలిస్టుల సమావేశంలో మాట్లాడారు. అనంతరం పుంగనూరు నియోజకవర్గ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడుగా జీఆర్.మురళి, అధ్యక్షుడిగా ఎస్ఆర్.సతీశ్‌రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మురళి, ఉపాధ్యక్షులుగా రెడ్డెప్ప, గిరీష్ , కృష్ణమూర్తి, నూరేషా , ఎం. కృష్ణమూర్తి, మల్లెల గిరిబాబు, ప్రధాన కార్యదర్శిగా పిపి. హిదాయితుల్లా, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా రామారావు తదితరులను ఎన్నుకున్నారు.

### కుటుంబ కలహాలతో ఆత్మహత్యాయత్నం

పుంగనూరు రూరల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో భర్త ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన శుక్రవారం పుంగనూరు మండలంలో జరిగింది. జట్టిగుండ్లపల్లెకు చెందిన సి.పోతన్న(36) వ్యవసాయ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. భార్యభర్తల మధ్య చిన్న గొడవ జరగడంతో జిల్లేడు పాలు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందించారు.

## ఘనంగా శ్రీకృష్ణదేవరాయల జయంతి



కుప్పంలో శ్రీకృష్ణదేవరాయులకు నివాళులర్పిస్తున్న నరేశ్ తదితరులు



పలమనేరులో నివాళులర్పిస్తున్న నాయకులు

పలమనేరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): పలమనేరు బీజేపీ కార్యాలయంలో శుక్రవారం శ్రీకృష్ణదేవరాయల జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పట్టణ బీజేపీ అధ్యక్షులు తాతయ్యనాయుడు పాల్గొన్నారు.

● కుప్పం: కుప్పంలో శుక్రవారం జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి నరేశ్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణదేవరాయుల జయంతిని ఘనంగా నిర్వహించారు. కుప్పం పురపాలక సంఘం అమరావతి కాలనీలోని శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి జనసేన శ్రేణులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నరేశ్ మాట్లాడుతూ దేశ భాషలందు తెలుగు లెస్స అని తెలుగు భాషా సంస్కృతులకు పట్టంగట్టి తెలుగు సాహిత్యాన్ని, తెలుగు కవులను ప్రోత్సహించిన శ్రీకృష్ణదేవరాయలు సాహితీ సమరాంగణ సార్వభౌమునిగా ప్రఖ్యాతిగాంచారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకుల, జన సైనికులు తదితరలు పాల్గొన్నారు.

# కేరట్ మనదే!

భోజనకుతూహలం
ఆహారంతో ఆరోగ్యం

'కేరో' అనే ఇండో-యూరోపియన్ మూల పదానికి 'కొమ్ము' ఆకారంలో ఉండేదని అర్థం. పసుపుకొమ్ము, శొంఠి కొమ్ము లాగానే 'కేరెట్ కొమ్ము' అని వాడేవారు. చాలామంది ఇది విదేశాల నుంచి మనకు దిగుమతి అయిన దుంప అని భావిస్తారు. వాస్తవానికి ఈ దుంప మన దేశంలో కొన్ని వేల ఏళ్లుగా పండుతోంది. మన ప్రాచీన ఆయుర్వేద గ్రంథాలు గుంజన దుంపలు, గాజర గడ్డలనే పేర్లతో కేరట్‌నే పేర్కొన్నాయి. 16వ శతాబ్ది నాటి భోజన కుతూహలం, 17వ శతాబ్ది నాటి హంసవింశతి గ్రంథాలలో ఈ దుంప ప్రస్తావన ఉంది.

మనకు దొరికే గాజర దుంపలు లేత కాషాయ రంగులో ఉంటాయి. ఇవి మిగిలిన రంగుల్లో కూడా మనకు లభ్యమవుతాయి. కేరట్ కాయలను మెరికార్స్ అంటారు. మానవ శరీరంలో నిర్మాణ క్రియలకు సమస్యలు ఏర్పడినపుడు వాటిని సరిచేసే గుణం వీటికుంది. ఇక కేరట్‌లోని బీటాకెరోటీన్ అనే పదార్థంవల్ల ఆ దుంపలకు కాషాయ వర్ణం ఏర్పడుతుంది. సాధారణంగా మొక్కల్లోని కణాలను అల్ట్రావయొలెట్ కిరణాల నుంచి ఈ బీటాకెరోటిన్ కాపాడుతూ ఉంటుంది. అందువల్లే కేరట్‌ను తింటే బీటాకెరోటిన్ శరీరానికి అందుతుంది. చర్మం నిగనిగలాడుతుంది. అంతేకాకుండా కంటి చూపు మెరుగుపరచటానికి కూడా కేరట్ ఉపకరిస్తుంది. రెండో ప్రపంచ యుద్ధం సమయంలో బ్రిటిష్ సైనికులకు కంటి చూపు మెరుగుపరచటం కోసం కేరట్‌ను ఆహారంగా పెట్టేవారట!



**కేరట్, ముల్లంగి, కీర... ఈ మూడు దుంపలను సమాన పరిణామాల్లో తీసుకొని జ్యూస్ చేసుకొని రోజూ ఉదయం తాగితే శరీరంలోని అనేక రకాల రోగాలు తగ్గుతాయి. దీనిలో కొద్దిగా పెరుగు కలిపినా మంచిదే.**

### 'భోజన కుతూహలం' గ్రంథం ప్రకారం కేరట్ వల్ల కలిగే ప్రయోజనాలివి...

- కేరట్‌లు కఫ దోషాలను పోగొడతాయి. కడుపు ఉబ్బరాన్ని, ఆమ్లాలను తగ్గిస్తాయి.
- నులిపురుగులను అరికడతాయి. కడుపునొప్పి వంటి సమస్యలకు ఔషధంగా పని చేస్తాయి.
- శరీరంలో వేడి తగ్గుతుంది. చలవ చేస్తుంది. దప్పిక కూడా తగ్గుతుంది.
- స్త్రీలలో రక్తస్రావాన్ని అరికట్టడానికి ఇవి ఉపకరిస్తాయి
- అమీబియాసిస్ వ్యాధి ఉన్నవారికి కేరట్‌వల్ల ఎన్నో ప్రయోజనాలుంటాయి.

● గంగరాజు అరుణాదేవి

ఆవకాయ, మాగాయి, నిమ్మకాయ...
ఇలా రకరకాల నిల్వ పచ్చళ్లు తింటే ఆరోగ్య సమస్యలు వస్తాయని...
అందువల్ల ఎక్కువగా తినవద్దని... తాజా కూరగాయలతో
తయారుచేసిన పచ్చళ్లనే తినమని
డాక్టర్లు సూచిస్తూ ఉంటారు.
అలాంటి కొన్ని పచ్చళ్ల తయారీ...
మీ కోసం.



వంటిల్లు

# తాజా తాజా చట్నీలు

## మిక్స్‌డ్ వెజిటబుల్ చట్నీ

**కావాల్సిన పదార్థాలు:**

ఉల్లిపాయ ముక్కలు- పావు కప్పు, తరిగిన పచ్చిమిర్చి- రెండు చెంచాలు, తరిగిన అల్లం: అర చెంచా, వెల్లుల్లి రెబ్బలు- నాలుగు, పసుపు- అర చెంచా, టమోటా ముక్కలు- ఒక కప్పు, కేరట్- అర కప్పు, బీన్స్- పావు కప్పు, కాలీఫ్లవర్- అర కప్పు, తరిగిన కొత్తిమీర- రెండు చెంచాలు, చింతపండు రసం- రెండు చెంచాలు, పంచదార- ఒక చెంచా, ఉప్పు- తగినంత, నూనె- పావు కప్పు, ఆవాలు- ఒక చెంచా, మినపప్పు- ఒక చెంచా, జీలకర్ర- ఒక స్పూను, ఎండు మిరపకాయలు- రెండు, ఇంగువ- తగినంత

**తయారీ విధానం:**



- కేరట్, బీన్స్, కాలీఫ్లవర్ ముక్కలను కుక్కర్‌లో ఒక విజిల్ వచ్చే దాకా ఉడికించాలి. ఆ తర్వాత బయటకు తీసి చల్లార్చాలి.
- ఒక మూకుడులో నూనె తీసుకొని అందులో తరిగిన ఉల్లిపాయలు, అల్లం, పచ్చిమిర్చి ముక్కలు, వెల్లుల్లి రెబ్బలు వేసి దోరగా వేయించాలి. చివరగా పసుపు వేయాలి.
- ఆ మిశ్రమంలోనే టమోటాలు వేసి ఉడకనివ్వాలి. తరువాత ఉడికించిన కూర ముక్కలు వేయాలి. పంచదార కలపాలి.
- కూర ముక్కల్లోని నీళ్లు ఆవిరి అయ్యేదాకా మగ్గనివ్వాలి. ఈ మిశ్రమాన్ని కిందకు దింపి చల్లారనివ్వాలి.
- ఒక మిక్సీలో ఈ మిశ్రమాన్ని, కొత్తిమీర, చింతపండు రసం, ఉప్పు వేసి ముద్దగా చేయాలి. దీనిని ఒక గిన్నెలో పెట్టుకోవాలి.
- వేరే మూకుడులో కొద్దిగా నూనె వేసి ఆవాలు, మినపప్పు, జీలకర్ర, ఎండు మిరపకాయలు, ఇంగువ వేసి వేయించాలి. దీనిని గిన్నెలోని పచ్చడిలో కలపాలి.

**జాగ్రత్తలు:**

- పంచదార వేయటంవల్ల పచ్చడిలో ఉన్న ఆమ్ల లక్షణాలు తొలగిపోతాయి. తినటానికి కమ్మగా ఉంటుంది.
- ఈ పచ్చడిలో టమోటా ముక్కలు ఎక్కువ వేయకూడదు.

## ముల్లంగి ఆకుల చట్నీ



**కావాల్సిన పదార్థాలు:**

తరిగిన కొత్తిమీర- అర కప్పు, ముల్లంగి ఆకులు- అర కప్పు, ముల్లంగి ముక్కలు- పావు కప్పు, వెల్లుల్లి రెబ్బలు- ఆరు, పచ్చిమిర్చి ముక్కలు- రెండు చెంచాలు, తరిగిన అల్లం ముక్కలు- అర చెంచా, నూనె- రెండు చెంచాలు, నిమ్మకాయ రసం- నాలుగు చెంచాలు, ఉప్పు- తగినంత

**తయారీ విధానం:**

- మూకుడులో నూనె వేసి కొత్తిమీర, ముల్లంగి ఆకులు, పచ్చిమిర్చి ముక్కలు, అల్లం ముక్కలు, వెల్లుల్లి రెబ్బలు వేసి దోరగా వేయించాలి.
- ఈ మిశ్రమం చల్లారిన తర్వాత మిక్సీలో వేసి ముద్దగా చేయాలి.
- ఆ మిశ్రమంలోనే ముల్లంగి ముక్కలు, ఉప్పు వేసి బాగా ముద్దగా చేయాలి. అందులో నిమ్మకాయ రసం కలపాలి.

**జాగ్రత్తలు:**

- కొన్నిసార్లు ముల్లంగి చేదుగా ఉంటుంది. అలాంటి ముల్లంగిని వాడకూడదు. లేత ముల్లంగి ఆకులతో మంచి రుచి వస్తుంది.
- నిమ్మ రసం కూడా తగినంత చేర్చుకోవాలి. నిమ్మ రసం ఎక్కువ అయినా రుచి బాగుండదు.

## చేమ ఆకుల చట్నీ

**కావాల్సిన పదార్థాలు:**



సన్నగా తరిగిన చేమ ఆకులు- రెండు కప్పులు, పచ్చిమిర్చి ముక్కలు- మూడు స్పూన్లు, చింతపండు రసం- రెండు చెంచాలు, బెల్లం పొడి- రుచికి తగినంత, కొబ్బరి తురుము- నాలుగు చెంచాలు, వేయించిన నువ్వులు- రెండు చెంచాలు, నూనె- పావు కప్పు, తరిగిన కొత్తిమీర- రెండు స్పూన్లు, ఉప్పు- తగినంత, నీళ్లు- తగినన్ని

**తయారీ విధానం:**

- ఒక మూకుడులో నూనెను వేడి చేయాలి. దీనిలో చేమ ఆకులు, పచ్చిమిర్చి ముక్కలు వేయించాలి.
- ఈ మిశ్రమంలో చింతపండు రసం, బెల్లం పొడి, కొద్దిగా నీళ్ల పోసి బాగా ఉడకబెట్టాలి. కిందకు దింపి చల్లార్చాలి.
- మరో మూకుడులో కొబ్బరి తురుము, నువ్వులు దోరగా వేయించాలి. ఇవి చల్లారిన తర్వాత మిక్సీలో వేసి పొడి చేసుకోవాలి.
- ఈ పొడిలో చేమ ఆకుల మిశ్రమం, ఉప్పు వేసి ముద్దగా చేసుకోవాలి. తరిగిన కొత్తిమీర కలపాలి.

**జాగ్రత్తలు:**

- లేత చేమ ఆకులు రుచిగా ఉంటాయి. అయితే ఇవి ఉడకటానికి మామూలు ఆకు కూరల కన్నా ఎక్కువ సమయం పడుతుంది.
- బెల్లం బదులు పంచదార కూడా వేసుకోవచ్చు



## దుస్తులపై మరకలా... వదిలించండిలా...


ఒక్కోసారి బట్టలపై అనుకోనివిధంగా మరకలు పడుతుంటాయి. సబ్బుతో ఉతికినా, వాషింగ్ మెషిన్‌లో వేసినా అవి పోవు. కొన్ని చిట్కాలు పాటించి మొండి మరకలను సైతం సులువుగా పోగొట్టుకోవచ్చు. వాటి గురించి తెలుసుకుందాం!

- బట్టలపై సిరా మరకలు పడితే వాటి మీద కొద్దిగా శానిటైజర్ లేదా పెర్ఫ్యూమ్ చల్లి దూదితో రుద్దాలి. ఒక చెంచా బేకింగ్ సోడాని నీళ్లతో తడిపి ముద్దలా చేసి ఈ మిశ్రమంతో రుద్దినా సిరా మరకలు వెంటనే పోతాయి. మరక మీద కొద్దిగా డెటాల్ వేసి అయిదు నిమిషాలు అలాగే ఉంచాలి. తరవాత టూత్ బ్రష్‌తో రుద్దితే మరక పోతుంది.
- బట్టల మీద టీ లేదా కాఫీ ఒలికి మరకలు పడుతుంటాయి. అలాంటపుడు ఒక గిన్నెలో ఒక చెంచా నిమ్మరసం, ఒక చెంచా వైట్ వెనిగర్ వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమంతో మరకమీద రుద్దితే ఫలితం ఉంటుంది. మరక మీద టూత్ పేస్ట్ రాసి పది నిమిషాలు అలాగే ఉంచాలి. తరవాత వేడి నీళ్లతో కడిగి సబ్బుతో ఉతికితే మరకలు పోతాయి.
- పార్కులో కూర్చున్నపుడు లేదా తోటపనిచేసినపుడు బట్టల మీద మరకలు ఏర్పడుతుంటాయి. అర బకెట్ నీళ్లలో అయిదు చెంచాల వెనిగర్ వేసి బాగా కలపండి. ఈ నీళ్లలో బట్టలను గంటసేపు నానబెట్టి తరవాత సబ్బుతో ఉతికితే మరకలన్నీ పోతాయి. టమాటా, తుప్పు, జ్యూస్, రక్తం మరకలను కూడా ఈవిధంగానే పోగొట్టవచ్చు.
- చాక్లెట్ మరకలైనపుడు ఆ బట్టలను.... బట్టల సోడా కలిపిన నీళ్లలో అరగంటసేపు నానబెట్టి సబ్బుతో ఉతికితే చాలు.
- బట్టలను వాషింగ్ మెషిన్‌లో వేసినపుడు కొన్నిటి రంగులు మిగతా వాటికి అంటుకుంటుంటాయి. సబ్బుతో రుద్దినా ఆ మరకలు పోవు. వాటి మీద 90 శాతం ఆల్కహాల్ ఉన్న ద్రావణాన్ని చల్లి దూదితో రుద్దితే రంగుల మరకలు పోతాయి.
- రక్తం మరకలు పడినపుడు వాటి మీద హైడ్రోజన్ పెరాక్సైడ్ ద్రావణం చల్లి అరగంటసేపు ఉంచాలి. తరవాత సబ్బుతో ఉతికితే మరకలు పోతాయి.
- నూనె మరకలు పడినపుడు వాటి మీద డిష్ వాషింగ్ లిక్విడ్ లేదా బేకింగ్ సోడా చల్లి అరగంట తరవాత టూత్‌బ్రష్‌తో రుద్దితే చాలు.
- బకెట్ వేడి నీళ్లలో కొద్దిగా సర్ఫ్, కొద్దిగా బట్టల సోడా వేసి బాగా కలిపి అందులో బట్టలను నానబెట్టాలి. అరగంట తరవాత వాటిని సబ్బుతో ఉతికి ఎండలో ఆరవేస్తే తెలికపాటి మరకలన్నీ పోతాయి.



చిత్రజ్యోతి
SINCE 1965

నేడు ఎన్టీఆర్ 29వ వర్ధంతి



# పురాణ పరిజ్ఞానంలోనూ అన్నగారు మిన్న!

'ధన, రుణ సమ్మిళితం శక్తి-తత్ఫలితం సృష్టి' అన్నది అనాదిగా జగమెరిగిన సత్యం! పాజిటివ్, నెగిటివ్ అన్నవి లేకుంటే పవర్ లేదన్న విషయం సైన్స్ కూడా ధ్రువీకరిస్తోంది. దీనిని అనుసరించే కళలు కాంతులీనాయని ప్రతీతి. రచనలోనూ ఈ విషయాన్నే స్మరిస్తూ ఓ కథలోని ప్రధాన పాత్రల్లోని తప్పొప్పులను విశదీకరిస్తూ సాగారు. వేద వ్యాస భగవానుడు కూడా అదే తీరున పంచమ వేదం మహాభారతాన్ని రచించారు. యూదు, క్రైస్తవ, ఇస్లామ్ మతస్థులు పవిత్రంగా భావించే మోజెస్ రచనలు సైతం ఇదే పంథాను అనుసరించాయని చెప్పవచ్చు. ఇవన్నీ తెలుగు చిత్రసీమలో పౌరాణికాలతో కళాఖండాలు తెరకెక్కించిన వారికి తెలియనివి కావు. అలాగే ప్రపంచంలోనే అత్యధిక పౌరాణిక చిత్రాల్లో నటించిన విశ్వవిఖ్యాత నటసార్వభౌమ నందమూరి తారక రామారావుకు కూడా ఆ పురాణపరిజ్ఞానం ఉందనే విషయాన్ని ఆయన తెరకెక్కించిన పురాణగాథలు చెప్పకనే చెబుతాయి.

● ఈ మధ్య ఎన్టీఆర్ పుట్టిన గడ్డపైనే నిల్చుని అనంతమైన అవివేకం ప్రదర్శిస్తూ కర్ణుని పాత్రను గొప్పగా చిత్రీకరించడం తప్పు అని ఇంకా ఏవేవో చెప్పారు. 'దానవీరశూర కర్ణ'లో కర్ణుడిని గొప్పగా చూపించడం వల్లే తరువాతి తరాల వారు కర్ణ పాత్రను ఎంతో ఉదాత్తంగా భావిస్తున్నారని వారి భావన! నిజానికి ఎన్టీఆర్ కంటే ముందు కూడా ఎంతోమంది కర్ణుని గొప్పతనం గురించి పౌరాణిక చిత్రాల్లో ప్రస్తావించినవారున్నారు. ఘోష యాత్ర సమయంలోనూ, గోగ్రహణ సమయాన కర్ణుడు పరాజితుడైన మాట వాస్తవమే! అయితే అదే కర్ణుడిపై దుర్యోధనునికి ఎందుకంత నమ్మకం అంటే అస్త్రశస్త్ర రచనలోనూ, గదాయుద్ధంలోనూ ప్రావీణ్యం ఉన్న జరాసంధుని సైతం కర్ణుడు నిలువరించి ఉంటాడు. అందువల్ల దుర్యోధనునికి కర్ణుడంటే అంతటి విశ్వాసం! ఇక తన ప్రాణరక్షితాలైన సహజ కవచకుండలాలను ఇంద్రునికి దానమిచ్చిన సమయంలోనే బలి, శిబి, దధీచి వంటి పుణ్యాత్ముల సరసన చేరాడు కర్ణుడు. ఇవన్నీ కాదు సాక్షాత్తు వేదవ్యాసుడే కర్ణుని గొప్పతనాన్ని వివరిస్తూ 'మహాతేజస్వి, అభిమానవంతుడు, ధార్మికోత్తముడు..' అంటూ (మహాభారతం-ఉద్యోగపర్వం 144-31)లో వర్ణించాడు. ఇలాంటి అంశాలన్నీ నటరత్న ఎన్టీఆర్‌కు తెలియనివి కావు. ప్రధాన పాత్రలోని మంచిచెడ్డలలో మంచినే ఎక్కువగా ప్రదర్శించాలన్న సంప్రదాయాన్ని అనుసరించారు ఎన్టీఆర్. ఆయనే కాదు తరవాత వెలసిన పురాణాల లక్ష్యం కూడా అదే! ఆ అష్టాదశ పురాణాలను సైతం 'మహాభారత' కర్త వేదవ్యాసులవారే అందించారు.

● అదే తీరున రామాయణ, భారత, భాగవతాలను అందులోని పాత్రలను ఆశ్రయించుకొని తరువాతి రోజుల్లో పలు రచనలు వచ్చాయి. ఇక తెలుగులో కవిత్రయం మూలభారతంలోని కొన్ని అంశాలను వదిలివేసిన సందర్భాలూ ఉన్నాయి. ఈ తీరున ఎవరికి వారు తమ స్వేచ్ఛాసృష్టితో ఆ పురాణ పాత్రలకు తమదైన రీతిలో హంగులు అద్దారు. అలా వెలసిన కథనే మనమంతా మహా కళా ఖండమని కీర్తిస్తున్న 'మాయాబజార్'(1957) చిత్ర రాజం!

● తొలి నుంచీ మన పురాణాల లక్ష్యం సామాన్యులలో సత్‌ప్రవర్తన కలుగజేయడమే! ఎన్టీఆర్ సైతం దానిని అనుసరించారు. తాను తొలిసారి స్వీయ దర్శకత్వంలో నటిస్తూ తెరకెక్కించిన 'సీతారామకళ్యాణం'లో రావణ పాత్రను అదే తీరున చిత్రీకరించారు. పరమశివభక్తుడైన రావణుడు స్త్రీ వ్యామోహంతో పతనమయ్యాడని చాటారు. ఎన్నో సున్నితాంశాలను సైతం నిశితంగా చాటిన ఎన్టీఆర్ పురాణ పరిజ్ఞానాన్ని శంకించడం అనంతమైన అజ్ఞానమే అవుతుంది. 'లవకుశ' చిత్రం ఘనవిజయం తరువాత ఆ సినిమా వెలుగు చూడటానికి కారకులైన సుందర్‌లాల్ నహతా ఎన్టీఆర్‌ను ఓ కోరిక కోరారు. హిందీలో తాను తీసే సినిమాలో శ్రీకృష్ణ పాత్ర ధరిస్తే కోటి రూపాయలు పారితోషికంగా సమర్పించుకుంటానని అన్నారు నహతా. అయినా ఎన్టీఆర్ తన పౌరాణిక పాత్రలు తెలుగు వారికే సొంతం కావాలని ఆశించి, నహతా ఆఫర్‌ను సున్నితంగా తిరస్కరించారు. తన తెలుగు జాతి అంటే ఎన్టీఆర్‌కు అంతటి అభిమానం! అలాగే తెలుగుదేశం పార్టీతో రాజకీయ ప్రవేశం చేసి సృష్టించిన చరిత్ర తెలిసిందే. ప్రజల మదిలో ఆయన నేటికీ కొలువై ఉండడానికి ఆయన పోషించిన పౌరాణిక పాత్రలు, వాటిలో చూపించిన వైవిధ్యం కారణమని చెప్పక తప్పదు. భారతీయులు పవిత్రంగా భావించే దేవతామూర్తుల పాత్రల్లో ఎన్టీఆర్ నటించలేదు, జీవించారు. అందువల్లే ఈ నాటికీ ప్రజల హృదయాల్లో ఎన్టీఆర్ జీవించే ఉన్నారు. అంతటి మహానటుణ్ణి, మహానాయకుణ్ణి కొందరు స్వార్థపరులు రాజకీయం కోసం వేలెత్తి చూపించే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికే రాజకీయ ప్రయోజనాల కోసం ఉత్తరాదిన ఓ మహా స్వాప్నికుడిని హిందువు కాదంటూ ఛిద్రం చేసే ప్రయత్నం చేస్తున్నారు. అదే తీరున ఎన్టీఆర్ పేరును కూడా తమ పాలిటిక్స్‌కు ఉపయోగించుకోవాలనుకుంటే ఇక్కడ అటువంటివారి పప్పులు ఉడకవు. ఎందుకంటే తెలుగు నేలతో మమేకమైన - తెలుగు జనతతో పెనవేసుకున్న ఎన్టీఆర్ అనుబంధం అంతటి గాఢమైనది.

- కొమ్మినేని వెంకటేశ్వర రావు

## నా రికార్డ్స్ అన్నీ అన్‌స్టాపబుల్

-నందమూరి బాలకృష్ణ



నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా నటించిన 'డాకు మహారాజ్' చిత్రం సంక్రాంతి సందర్భంగా విడుదలై ఘన విజయం సాధించిన నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం హైదరాబాద్‌లోని ఐటీసీ కోహినూర్‌లో విజయోత్సవ సభను చిత్ర బృందం నిర్వహించింది. ఈ కార్యక్రమంలో బాలకృష్ణ మాట్లాడుతూ 'వరుసగా ఇది నాకు నాలుగో విజయం. నీటి సమస్య గురించి ప్రజలకు అవగాహన కలిగించిన సినిమా డాకు మహారాజ్. ఒక తెలుగు ఇంజనీర్ రాజస్థాన్ వెళ్లి, అక్కడి ప్రజల కోసం డాకుగా మారడం ఈ సినిమాలో చూశారు. ఆదరించి, అఖండమైన విజయాన్ని అందించిన తెలుగు ప్రేక్షకులందరికీ నా హృదయపూర్వక కృతజ్ఞతలు. నన్ను ఎంతగానో ప్రేమించి, నాలో ఉన్న నట విశ్వరూపాన్ని ఆవిష్కరించేలా చేశాడు దర్శకుడు బాబీ. అలాగే మా నిర్మాత వంశీ గారు నా అభిమాని. ఈ సినిమాలో కొత్త బాలకృష్ణను ఆవిష్కరించాలని ఆయన కల కన్నారు. అన్ని క్రాఫ్ట్ మీద మంచి గ్రిప్ ఉన్న వంశీ.. నా అభిమాని కావడం నాకు చాలా గర్వంగా ఉంది. మన సినిమాలను చూసి ప్రశంసించే స్థాయికి తెలుగు చలన చిత్రసీమ ఎదిగింది. నా వరకు చూసుకుంటే, నా రికార్డ్స్ అన్నీ అన్ స్టాపబుల్, నా కలెక్షన్స్ అన్నీ అన్ స్టాపబుల్, నా అవార్డ్స్ అన్నీ అన్ స్టాపబుల్, నా రివార్డ్స్ అన్నీ అన్ స్టాపబుల్ అన్నారు. ఈ నెల 22న అనంతపురంలో విజయోత్సవ పండుగ నిర్వహిస్తామని బాలకృష్ణ చెప్పారు. దర్శకుడు బాబీ కొల్లి మాట్లాడుతూ,' బాలకృష్ణ ఫిల్మోగ్రఫీలో ఒక మాస్టర్ పీస్ సినిమా ఇవ్వడానికి కారణమైన మా టీమ్ అందరికీ థాంక్యూ సో మచ్. బాలకృష్ణ గారు కథను అర్థం చేసుకొని, దర్శకుడు ఏది అడిగితే అది చేస్తారు' అన్నారు. నిర్మాత నాగవంశీ మాట్లాడుతూ, బాలకృష్ణ గారిని కొత్తగా చూపించాలనే ఉద్దేశంతో ఈ సినిమా చేశాము. అభిమానులు, ప్రేక్షకుల నుంచి మేము ఊహించిన దానికంటే పది రెట్లు ఎక్కువ స్పందన లభించింది. జనవరి 12న ఈ సినిమా విడుదలైతే, సంక్రాంతి పండుగ రోజుకే మా డిస్ట్రిబ్యూటర్లు సేఫ్ జోన్‌కి వెళ్లిపోయారు. అది మాకు పెద్ద సక్సెస్.' అన్నారు.

## మహేశ్ ట్వీట్ చేయడం ఆనందంగా ఉంది

- వెంకటేశ్



'కష్టపడి పనిచేస్తే ఫలితం వస్తుందని నా నమ్మకం. ఆ నమ్మకాన్ని ఈ విజయం మరోసారి రుజువు చేసింది. ఇది మా విజయం కాదు, తెలుగు ప్రేక్షకులది. ఈ సినిమాను ఇంతటి సూపర్ డూపర్ హిట్ చేసిన ప్రేక్షకులకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు చెబుతున్నా' అని అన్నారు హీరో వెంకటేశ్. 'సంక్రాంతికి వస్తున్నాం' ఇటీవలె విడుదలై ప్రేక్షకాదరణతో సక్సెస్‌ఫుల్‌గా రన్ అవుతోంది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ పొంగల్ బ్లాక్‌బస్టర్ జాతర సెలబ్రేషన్స్ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో వెంకటేశ్ మాట్లాడుతూ 'చిత్ర పరిశ్రమలోని అనేక మంది ఫోన్ చేసి అభినందిస్తున్నారు. సినిమా చాలా నచ్చిందంటూ చిన్నోడు మహేశ్‌బాబు ట్వీట్ చేయడం చాలా ఆనందంగా ఉంది' అని అన్నారు. చిత్ర దర్శకుడు అనిల్ రావిపూడి మాట్లాడుతూ 'ఈ రోజు నాకు ఎనిమిది సక్సెస్‌లు అంటున్నారు. ప్రేక్షకుల సపోర్ట్ లేకుంటే నాకు ఏ విజయమూ దక్కేది కాదు. ఒక దర్శకుడిగా ప్రేక్షకులకు ఎంతగా రుణపడి ఉండాలో అర్థం కావడం లేదు' అన్నారు. నిర్మాత దిల్ రాజు మాట్లాడుతూ 'ఈ సినిమా మేము ఊహించని మహా అద్భుతం. అనిల్, వెంకటేశ్ కాంబినేషన్‌లో సినిమా అంటే పాజిటివ్ వైబ్రేషన్. ఇది మాకు బ్లాక్ బస్టర్ పొంగల్. ఈ సంక్రాంతిని మర్చిపోలేం' అని అన్నారు. మరో నిర్మాత శిరీష్ మాట్లాడుతూ 'ఎన్టీఆర్ ఆర్ట్స్ హరికి కృతజ్ఞతలు చెప్పాలి. ఈ చిత్రం మా సమస్యలన్నింటినీ తీరుస్తుందని షూటింగ్‌లో చెప్పేవారు. ఆయన మాట నిజమైంది' అని అన్నారు.

**పెద్దోడిని అభినందించిన చిన్నోడు**

శుక్రవారం సాయంత్రం నిర్వహించిన సెలబ్రేషన్స్‌కు మహేశ్ హాజరై సందడి చేశారు. వెంకటేశ్‌తో పాటు చిత్రబృందాన్ని అభినందించారు.


రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి ఖేల్‌రత్న పురస్కారాలు అందుకుంటున్న మను భాకర్, ప్రవీణ్ కుమార్, హర్మన్‌ప్రీత్ సింగ్, గుకేష్

# కనుల పండుగ.. క్రీడా అవార్డుల వేడుక

న్యూఢిల్లీ (ఆంధ్రజ్యోతి): క్రీడారంగంలో విశేష ప్రతిభ కనబర్చిన ఆటగాళ్లను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఘనంగా సత్కరించారు. శుక్రవారం రాష్ట్రపతి భవన్‌లో జాతీయ క్రీడా అవార్డుల వేడుక కన్నుల పండుగగా జరిగింది. ఇందులో భాగంగా అత్యున్నత క్రీడా పురస్కారమైన మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న అవార్డును డబుల్ ఒలింపిక్ మెడలిస్ట్ షూటర్ మను భాకర్, వరల్డ్ చెస్ చాంపియన్ గుకేశ్‌లతో పాటు హాకీ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్, పారాలింపిక్స్ విజేత ప్రవీణ్ కుమార్ అందుకున్నారు. వీరికి సర్టిఫికెట్, మెడల్‌తో పాటు తలా రూ.25 లక్షల రివార్డు దక్కుతుంది. అలాగే 32 మంది అథ్లెట్లు అర్జున అవార్డును అందుకోగా, ఐదుగురు ద్రోణాచార్య స్వీకరించారు. తెలంగాణకు చెందిన పారా అథ్లెట్ దీప్తి జివాంజితో పాటు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ట్రాక్ అండ్ ఫీల్డ్ అథ్లెట్ జ్యోతి యర్రాజిలకు అర్జున దక్కింది. దీప్తి అవార్డును స్వీకరించగా, జ్యోతి శిక్షణ నిమిత్తం దక్షిణాఫ్రికాలో ఉండడంతో వేడుకకు హాజరుకాలేకపోయింది. ఈ పురస్కారంతో పాటు రూ.15 లక్షల రివార్డు వీళ్లకు దక్కనుంది.



### భావోద్వేగ సన్నివేశం..

అర్జున అవార్డు కోసం దశాబ్దాలుగా ఆయన పోరాటానికి ఫలితం దక్కింది. పారాలింపిక్స్‌లో దేశానికి తొలి స్వర్ణం అందించిన 80 ఏళ్ల మురళీకాంత్ పేట్కర్ చివరకు అర్జున అవార్డు (లైఫ్ టైమ్) అందుకున్నాడు. అయితే ఈ సందర్భంలో అంతటా భావోద్వేగం చోటుచేసుకుంది. 1965లో పాకిస్థాన్‌తో యుద్ధంలో పేట్కర్‌కు బుల్లెట్ గాయం తగిలి నడుం కింది భాగానికి వైకల్యం ఏర్పడింది. ఆ తర్వాత 1972 పారాలింపిక్స్ స్విమ్మింగ్‌లో అతను స్వర్ణం సాధించాడు. ఆహూతుల హర్షధ్వానాల మధ్య అతను చేతి కర్రల సహాయంతో అవార్డును స్వీకరించేందుకు రాగా, రాష్ట్రపతి ముందుకు వచ్చి పేట్కర్‌ను సత్కరించడం అందరినీ ఆకట్టుకుంది.

## షూటర్ ముకేష్‌కు రజతం



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): మొహాలీలో జరిగిన అఖిల భారత విశ్వవిద్యాలయాల షూటింగ్ చాంపియన్‌షిప్‌లో గుంటూరు షూటర్ ముకేష్ రజతంతో మెరిశాడు. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో ముకేష్ రెండో స్థానంలో నిలిచాడు.

## చెస్ పోటీలు ప్రారంభం

పెద్దాపురం (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురంలో జాతీయస్థాయి పాఠశాల చెస్ చాంపియన్‌షిప్ శుక్రవారం ఘనంగా మొదలైంది. టోర్నీని స్థానిక ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ప్రారంభించారు. ఈనెల 21 వరకు ఈ పోటీలు జరుగుతాయి.

## చాంపియన్స్ ట్రోఫీకి టీమిండియా ఎంపిక నేడే

ముంబై: చాంపియన్స్ ట్రోఫీతో పాటు ఇంగ్లండ్‌తో జరిగే మూడు వన్డేల సిరీస్ కోసం భారత జట్టును శనివారం ప్రకటించనున్నారు. 15 మందితో కూడిన ఈ ప్రాథమిక జట్టులో సెలెక్షన్ కమిటీ బుమ్రాపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది ఆసక్తికరంగా మారింది. ఆసీస్‌తో చివరి టెస్టులో తను గాయపడిన విషయం తెలిసిందే. అలాగే, ఈనెల 22 నుంచి ఇంగ్లండ్‌తో జరిగే పరిమిత ఓవర్ల సిరీస్‌కు కూడా జట్టును ప్రకటించనున్నారు.

# స్టార్లు సాఫీగా..


సబలెంకా

- ప్రీక్వార్టర్స్‌లో జొకో, అల్కారజ్, సబలెంకా, గాఫ్
- ఏడో సీడ్ పెగులాకు షాక్
- ఆస్ట్రేలియన్ ఓపెన్

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా ఓపెన్‌లో స్టార్ ఆటగాళ్లు అంచనాలను అందుకొంటూ ముందంజ వేస్తున్నారు. పురుషుల్లో..11వ టైటిల్‌పై కన్నేసిన దిగ్గజం నొవాక్ జొకోవిచ్, నాలుగు గ్రాండ్‌స్లామ్‌ల విజేత కార్లోస్ అల్కారజ్, రెండో సీడ్ అలెగ్జాండర్ జ్వెరేవ్ ప్రీక్వార్టర్‌ఫైనల్లో అడుగుపెట్టారు. మహిళల విభాగంలో డిఫెండింగ్ చాంప్ అర్యానా సబలెంకా, మూడో సీడ్ కొకొ గాఫ్ నాలుగో రౌండ్‌లో ప్రవేశించారు. అయితే మెల్‌బోర్న్ పార్క్‌లో రెండుసార్లు విజేతగా నిలిచిన నవోమి ఒసాకా గాయంతో మూడో రౌండ్ నుంచి అర్ధంతరంగా వైదొలగింది. ఏడో సీడ్ జెస్సికా పెగులాకు అన్‌సీడెడ్ సెర్బియా క్రీడాకారిణి ఓల్గా డానిలోవిచ్ షాకిచ్చింది. గత ఏడాది సెమీఫైనలిస్ట్ గాఫ్ 6-4, 6-2తో 2021 యూఎస్ ఓపెన్ రన్నరప్ లెలా ఫెర్నాండెజ్‌ని చిత్తు చేసింది. టాప్ సీడ్ సబలెంకా కూడా 7-6 (5), 6-4తో క్లారా టాసన్‌పై గెలిచింది. ఇతర మూడో రౌండ్ మ్యాచ్‌లలో 11వ సీడ్ పౌలా బడోసా 6-4, 4-6, 6-3తో 17వ సీడ్ కోస్త్యుక్‌ని, 14వ సీడ్ ఆండ్రీవా 6-2, 1-6, 6-2తో 23వ సీడ్ ఫ్రెచ్‌ని, 27వ సీడ్ పల్యుచెన్కోవా 6-1, 6-2తో సీగ్మండ్‌ని ఓడించి ప్రీక్వార్టర్స్‌కు చేరారు. 23 ఏళ్ల ఓల్గా డానిలోవిచ్ 7-6 (3), 6-1తో ఏడో సీడ్, యూఎస్ ఓపెన్ రన్నరప్ పెగులాపై సంచలన విజయం సాధించింది. 12వ సీడ్ ష్నీడెర్‌కు 7-6 (4), 6-7 (7), 7-5తో 18వ సీడ్ వెకిక్ షాకిచ్చింది. మరోవైపు నవోమి ఒసాకా 6-7 (7)తో టోక్యో ఒలింపిక్స్ చాంపియన్ బెలిండా బెన్సిక్‌తో తొలి సెట్‌ను కోల్పోయిన దశలో పొత్తి కడుపు నొప్పితో మ్యాచ్ నుంచి నిష్క్రమించింది. పురుషుల మూడో రౌండ్‌లో ఏడో సీడ్ జొకోవిచ్ 6-1, 6-4, 6-4తో టోమస్ మకాక్‌పై వరుస సెట్లలో విజయం సాధించాడు. అయితే రెండో సెట్‌లో జొకో శ్వాస పీల్చుకోవడంలో ఇబ్బందిపడ్డాడు. ఆపై చికిత్స తీసుకొని మ్యాచ్‌ను కొనసాగించాడు. రెండో సీడ్ జ్వెరేవ్ 6-3, 6-4, 6-4తో ఫెర్న్లీపై, మూడో సీడ్ అల్కారజ్ 6-2, 6-4, 6-7 (7), 6-2తో బోర్గెస్‌పై, 12వ సీడ్ టామీ పాల్ 7-6 (0), 6-2, 6-0తో కార్బలెస్‌పై విజయంతో నాలుగో రౌండ్‌కు చేరారు.

### మిక్స్‌డ్‌లో బోపన్న జోడీ బోణీ

పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లోనే వెనుదిరిగిన భారత వెటరన్ రోహన్ బోపన్న మిక్స్‌డ్‌లో బోణీ చేశాడు. మిక్స్‌డ్ డబుల్స్‌లో బోపన్న/షుయ్ జాంగ్ (చైనా) ద్వయం 6-4, 6-4తో డోడిగ్/క్రిస్టియానాపై నెగ్గి రెండోరౌండ్ చేరింది.

# అమ్మాయిలూ.. అదరగొట్టాలి

- డిఫెండింగ్ చాంపియన్‌గా భారత్
- తొలి రోజే ఆరు మ్యాచ్‌లు
- రేపు విండీస్‌తో యువ భారత్ పోరు



నేటి నుంచి అండర్-19 మహిళల టీ20 వరల్డ్‌కప్

ఉదయం 8 గం. నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో

కౌలాలంపూర్: భారత కొత్తతరం మహిళా క్రికెటర్లు అంతర్జాతీయ వేదికపై మరోసారి సత్తా నిరూపించుకోవాలనుకుంటున్నారు. శనివారం నుంచి మలేసియాలో అండర్-19 టీ20 వరల్డ్‌కప్ ఆరంభం కాబోతోంది. 2023లో దక్షిణాఫ్రికాలో జరిగిన తొలి మెగా టోర్నీలో షఫాలీ వర్మ నేతృత్వంలోని భారత జట్టు విజేతగా నిలిచింది. ఈసారి నికీ ప్రసాద్ కెప్టెన్సీలో టీమ్ చెలరేగి రెండో టీ20 వరల్డ్ కప్‌ను సైతం ఖాతాలో వేసుకోవాలనుకుంటోంది. ఈ టోర్నీలో మొత్తం 16 జట్లు పాల్గొంటుండగా, వీటిని నాలుగు గ్రూప్‌లుగా విభజించారు. ప్రతీ గ్రూప్ నుంచి టాప్-3 జట్లు సూపర్ సిక్స్ దశకు వెళతాయి. ఆ తర్వాత రెండు సూపర్ సిక్స్ గ్రూపుల్లో మొదటి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు సెమీస్‌లో తలపడతాయి. ఫిబ్రవరి 2న ఫైనల్ జరుగుతుంది. ఇక భారత జట్టు గ్రూప్ 'ఏ'లో ఉండగా శ్రీలంక, వెస్టిండీస్, మలేసియా ఇతర జట్లు. ఆదివారం విండీస్‌తో జరిగే పోరుతో భారత్ తమ టైటిల్ వేట ఆరంభిస్తుంది. అయితే శనివారం జరిగే టోర్నీ ప్రారంభ మ్యాచ్‌ల్లో ఆసీస్-స్కాట్లాండ్, ఇంగ్లండ్-ఐర్లాండ్, సమోవా-నైజీరియా, బంగ్లాదేశ్-నేపాల్, పాకిస్థాన్-యూఎస్‌ఏ, న్యూజిలాండ్-దక్షిణాఫ్రికా జట్లు తలపడతాయి.

**భారత్ షెడ్యూల్**

| | |
|---|---|
| జనవరి 19 | వెస్టిండీస్‌తో |
| జనవరి 21 | మలేసియాతో |
| జనవరి 23 | శ్రీలంకతో |

మ్యాచ్‌లన్నీ మధ్యాహ్నం 12 గం. నుంచి



### త్రిష మరోసారి..

గత నెలలో జరిగిన అండర్-19 ఆసియాకప్‌లో హైదరాబాదీ జి.త్రిష విశేషంగా రాణించింది. దీంతో ఆమె వరుసగా రెండోసారి ఈ మెగా టోర్నీలో చోటు దక్కించుకుంది. టాపార్డర్‌లో త్రిష దూకుడు జట్టుకు ఉపయోగపడగలదు. అలాగే స్పిన్ విభాగంలో పరునిక సిసోడియా, సోనమ్ యాదవ్, ఆయుషి శుక్లా కీలకం కానున్నారు. జట్టులో మరో ఇద్దరు తెలుగమ్మాయిలు కేసరి ధ్రుతి, షబ్నమ్‌లకు కూడా చోటు దక్కడం విశేషం.

**భారత మహిళల జట్టు:** నికీ ప్రసాద్ (కెప్టెన్), సానికా చాల్కే, త్రిష, కమలిని, భవిక, ఈశ్వరి, మిథిల, జోషితా, సోనమ్ యాదవ్, పరునిక, కేసరి ధ్రుతి, ఆయుషి, ఆనందిత, షబ్నమ్, వైష్ణవి.

# సింధుకు చుక్కెదురు

- సెమీస్‌కు సాత్విక్ జోడీ
- ఇండియా ఓపెన్



న్యూఢిల్లీ: సొంతగడ్డపై టైటిల్‌తో సత్తా చాటాలనుకున్న స్టార్ షట్లర్ పీవీ సింధుకు చుక్కెదురైంది. ఇండియా ఓపెన్ సూపర్ 750 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో క్వార్టర్‌ఫైనల్లోనే వెనుదిరిగింది. కాగా, పురుషుల డబుల్స్‌లో స్టార్ జోడీ సాత్విక్ సాయిరాజ్/చిరాగ్ శెట్టి సెమీఫైనల్స్‌కు దూసుకెళ్లి టోర్నీలో భారత్ ఆశలను సజీవంగా ఉంచింది. శుక్రవారం జరిగిన మహిళల సింగిల్స్ పోరులో మాజీ చాంపియన్ సింధు 9-21, 21-19, 17-21తో పారిస్ ఒలింపిక్స్ కాంస్య పతక విజేత గ్రెగోరియా మరిస్కా (ఇండోనేసియా) చేతిలో పరాజయం పాలైంది. 2017లో ఇండియా ఓపెన్ టైటిల్ నెగ్గిన సింధు.. ఆ మరుసటి ఏడాది రన్నరప్‌గా నిలిచింది. కాగా, పురుషుల సింగిల్స్ బరిలో మిగిలిన ఏకైక ఆటగాడు కిరణ్ జార్జ్ 13-21, 19-21తో చైనా షట్లర్ వెంగ్ హాంగ్‌యాంగ్ చేతిలో ఓటమిపాలయ్యాడు. పురుషుల డబుల్స్‌లో సాత్విక్/చిరాగ్ ద్వయం 21-10, 21-17తో కొరియా జోడీ కాంగ్ మిన్ హ్యాక్/హో జిన్‌ను చిత్తుచేసి సెమీస్ చేరింది. ఫైనల్ బెర్త్ కోసం మలేసియా జంట గో జె ఫె/ఇజుద్దీన్ కాన్‌తో సాత్విక్ ద్వయం తలపడనుంది.



## సీఎం చంద్రబాబును కలిసిన హంపి

అమరావతి (ఆంధ్రజ్యోతి): ఇటీవల ప్రపంచ ర్యాపిడ్ చెస్ టైటిల్ సాధించిన తెలుగు గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును శుక్రవారం మర్యాదపూర్వకంగా కలుసుకుంది. ఈ సందర్భంగా హంపిని చంద్రబాబు అభినందించారు. తెలుగు రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచిన హంపి.. భవిష్యత్‌లో మరిన్ని టైటిళ్లు గెలవాలని సీఎం ఆకాంక్షించారు. హంపి వెంట ఆమె కుటుంబసభ్యులు కూడా ఉన్నారు.

**విజయ్ హజారే టోర్నీ ఫైనల్ నేడు** | కర్ణాటక X విదర్భ | మ. 1.30 నుంచి

# 'ఆటో' పెట్టుబడుల కేంద్రంగా భారత్

## నాలుగేళ్లలో వాహన రంగంలోకి రూ.3.09 లక్షల కోట్ల ఎఫ్‌డీఐ

### ఏడాదిలో 2.5 కోట్ల వాహనాల విక్రయం.. భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పోలో ప్రధాని




న్యూఢిల్లీ: మొబిలిటీ రంగం భవిష్యత్తు భారత్‌దేనని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. దేశంలో గత ఏడాది రికార్డు స్థాయిలో రెండున్నర కోట్ల వాహనాలు అమ్ముడుపోయాయని, అనేక దేశాల జనాభా కన్నా మన దేశంలో కార్ల అమ్మకాలు అధికమని చెప్పారు. కేవలం నాలుగేళ్ల కాలంలో మొబిలిటీ రంగంలోకి 3,600 కోట్ల డాలర్ల (రూ.3.09 లక్షల కోట్లు) విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) వచ్చాయని చెప్పారు. ఐదు రోజుల పాటు జరిగే భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో 2025 ప్రదర్శనను ఢిల్లీలోని భారత మండపంలో శుక్రవారం ప్రారంభించిన సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. మొబిలిటీ (ఆటోమొబైల్) రంగంలో తన భవిష్యత్తును తీర్చి దిద్దుకోవాలనుకునే ప్రతి ఇన్వెస్టర్‌కు భారత్ అద్భుతమైన గమ్యమన్నారు. ఆటోమోటివ్ పరిశ్రమకు ఇన్నోవేషన్, టెక్నాలజీలే చోదకమని పేర్కొంటూ "ప్రపంచం కోసం దేశంలో తయారుచేయండి" అనే మంత్రంతో ముందడుగేసే ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం పూర్తి మద్దతు, ప్రోత్సాహం అందిస్తుందని ఆయన హామీ ఇచ్చారు. "మేక్ ఇన్ ఇండియా" మంత్రం ఆటోమొబైల్ రంగం వృద్ధికి ఎంతో దోహదపడిందని చెప్పారు. పీఎల్ఐ పథకాలు ఈ ప్రచారానికి కొత్త ఉత్తేజం కల్పించడంతో పాటు రూ.2.25 లక్షల కోట్ల విక్రయాలు, 1.5 లక్షల ప్రత్యక్ష ఉపాధి అవకాశాలకు బాట వేశాయని తెలిపారు. భారత్ ప్రస్తుతం ప్రపంచంలో ఐదో పెద్ద ఆర్థిక వ్యవస్థ, మూడో పెద్ద ప్రయాణికుల వాహన మార్కెట్‌గా ఉందన్నారు. అధిక సంఖ్యలో ఉన్న యువ జనాభా, పెరుగుతున్న మధ్యతరగతి జీవులు, వేగవంతమైన నగరీకరణ, ఆధునిక మౌలిక వసతుల అభివృద్ధి, అందుబాటులోకి వస్తున్న అఫర్డబుల్ వాహనాలు మొబిలిటీ మార్కెట్‌కు బలమని ఆయన అన్నారు.

### వేగంగా విస్తరిస్తున్న ఈవీ మార్కెట్

దేశంలో విద్యుత్ వాహనాల (ఈవీ) మార్కెట్ వేగవంతమైన వృద్ధిని నమోదు చేస్తోందని ప్రధాని చెప్పారు. గత దశాబ్ది కాలంలో ఈవీ విక్రయాలు 640 రెట్లు పెరిగాయన్నారు. 10ఏళ్ల క్రితం ఏడాదికి 2,600 ఈవీలు అమ్ముడుపోగా గత ఏడాది ఆ సంఖ్య 16.8 లక్షలకు చేరిందన్నారు. ఈ దశాబ్ది చివరి నాటికి ఈ సంఖ్య 8 రెట్లు పెరగవచ్చని అంచనా వేశారు.

**రతన్ టాటా, ఒసాము సుజుకీలకు నివాళి**

ఆటోమొబైల్ దిగ్గజాలైన రతన్ టాటా, ఒసాము సుజుకీలను ప్రధాని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. భారత ఆటోమొబైల్ వృద్ధికి, మధ్య తరగతి ప్రజల కలల సాకారానికి వారిద్దరి సేవలు చిరస్మరణీయమన్నారు. మొత్తం భారత మొబిలిటీ రంగానికి వారిద్దరి వారసత్వం ఎల్లప్పుడూ స్ఫూర్తిని అందిస్తుందని నివాళి ఘటించారు.

### మెర్సిడెస్ బెంజ్ రెండు కొత్త కార్లు



మెర్సిడెస్ బెంజ్ సరికొత్త బ్యాటరీ విద్యుత్ కారు (బీఈవీ) ఈక్యూఎస్ మేబాక్ ఎస్‌యూవీ 680 "నైట్ సీరీస్"ను విడుదల చేసింది. దీని ఎక్స్‌షోరూమ్ ధర రూ.2.63 కోట్లు. దీనితో పాటు మెర్సిడెస్ మేబాక్ జీఎల్ఎస్ 600 నైట్ సీరీస్ కారు కూడా విడుదల చేసింది. ఈ కారు ఎక్స్‌షోరూమ్ ధర రూ.3.71 కోట్లు. ఇవి కాకుండా కొత్తగా డెవలప్ చేసిన కాన్సెప్ట్ సీఎల్ఏ కారును ఆవిష్కరించింది.



### జేఎస్‌డబ్ల్యూ ఎంజీ సైబర్‌స్టర్

జేఎస్‌డబ్ల్యూ ఎంజీ రెండు కొత్త ఈవీ మోడళ్లను ఆవిష్కరించింది. ఇందులో ఎంజీ సైబర్‌స్టర్ కారు దేశంలోని తొలి ఆల్ ఎలక్ట్రిక్ రోడ్‌స్టర్ కారు. రెండోది ఎంజీ ఎం9. ఇది మూడు వరుసలున్న తొలి విద్యుత్ లిమోసిన్ కారు. ఈ రెండు కార్లను ఈ ఏడాదే మార్కెట్లో విడుదల చేస్తారు. ఈ కార్లతో తాము యాక్సెసిబుల్ లగ్జరీ విభాగంలోకి ప్రవేశించినట్టు కంపెనీ ప్రకటించింది.

### బీఎండబ్ల్యూ ఇండియా ఈవీ



జర్మనీకి చెందిన లగ్జరీ కార్ల దిగ్గజం బీఎండబ్ల్యూ పూర్తిగా స్థానికంగా తయారు చేసిన బీఎండబ్ల్యూ ఎక్స్ 1 లాంగ్ వీల్ బేస్ ఈవీని విడుదల చేసింది. దీని ఎక్స్‌షోరూమ్ ధర రూ.49 లక్షలు. దీన్ని చెన్నై ప్లాంట్‌లో ఉత్పత్తి చేశారు. బీఎండబ్ల్యూ నుంచి పూర్తిగా దేశీయంగా తయారైన తొలి ఈవీ ఇది.



### పోర్షే కొత్త విద్యుత్ ఎస్‌యూవీ

జర్మనీకి చెందిన లగ్జరీ స్పోర్ట్స్ కార్ల కంపెనీ పోర్షే సరికొత్త విద్యుత్ ఎస్‌యూవీ మకాన్, సరికొత్త హంగులతో తీర్చిదిద్దిన స్పోర్ట్ సెలూన్ టైకాన్‌ను భారత మార్కెట్లో విడుదల చేసింది. మకాన్ బీఈవీ మూడు మోడళ్లలో అందుబాటులో ఉంటుంది. ధర రూ.1.22 కోట్ల నుంచి రూ.1.69 కోట్ల మధ్యన ఉంటుంది. కొత్త హంగులతో విడుదల చేసిన టైకాన్ ధర రూ.1.89 కోట్ల నుంచి రూ.2.53 కోట్ల మధ్యన ఉంటుంది.

### సుజుకీ తొలి విద్యుత్ స్కూటర్



సుజుకీ మోటార్ సైకిల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ తొలి విద్యుత్ స్కూటర్ ఈ-యాక్సెస్‌ను, మరో రెండు కొత్త మోడళ్లను విడుదల చేసింది. ఈ యాక్సెస్ 3.07 కిలోవాట్ల లిథియం ఐరన్ ఫాస్ఫేట్ బ్యాటరీతో వస్తుంది. ఒకసారి చార్జింగ్ చేస్తే 95 కిలోమీటర్లు ప్రయాణిస్తుంది. ఇతర మోడళ్లలో జిక్సర్ ఎస్ఎఫ్ ఫ్లెక్స్ ఫ్యుయెల్ బైక్, పూర్తిగా కొత్తగా తయారుచేసిన యాక్సెస్ 125 సీసీ స్కూటర్ ఉన్నాయి.



### హీరో మోటోకార్ప్

టూవీలర్ దిగ్గజం హీరో మోటోకార్ప్ నాలుగు కొత్త వాహనాలను ప్రదర్శించింది. ఎక్స్‌ట్రీమ్ 250 ఆర్ ద్వారా 250 సీసీ వాహనాల విభాగంలోకి తొలిసారిగా ప్రవేశించింది. అలాగే ఎక్స్‌పల్స్ 210 బైక్, జూమ్ 125, జూమ్ 160 స్కూటర్లు కూడా ప్రదర్శించిన వాహనాల్లో ఉన్నాయి. ఈ వాహనాలన్నింటి బుకింగ్స్ ఫిబ్రవరిలో ప్రారంభమవుతాయి. మార్చి నుంచి వాహనాల డెలివరీ ప్రారంభిస్తారు.

# బిజినెస్

# విప్రో లాభంలో 24 శాతం వృద్ధి

క్యూ3లో రూ.3,354 కోట్లుగా నమోదు

ఒక్కో షేరుకు రూ.6 మధ్యంతర డివిడెండ్

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికానికి (క్యూ3) విప్రో ఏకీకృత నికర లాభం వార్షిక ప్రాతిపదికన 24.4 శాతం వృద్ధితో రూ.3,354 కోట్లకు చేరుకుంది. సమీక్షా కాలానికి కంపెనీ ఆదాయం కేవలం 0.5 శాతం పెరిగి రూ.22,319 కోట్లుగా నమోదైంది. ఈ మార్చితో ముగియనున్న నాలుగో త్రైమాసికం(క్యూ4)లో ఐటీ సేవల ద్వారా సమకూరే ఆదాయం 260.2-265.5 కోట్ల డాలర్ల స్థాయిలో ఉండవచ్చని విప్రో అంచనా వేసింది. క్యూ3తో పోలిస్తే క్యూ4లో ఐటీ సేవల ఆదాయ వృద్ధి మైనస్ 1 శాతం నుంచి ఒక శాతం శ్రేణిలో ఉండవచ్చని అంచనా. కాగా, ఈ ఆర్థిక సంవత్సరానికి గాను వాటాదారులకు ఒక్కో షేరుకు రూ.6 మధ్యంతర డివిడెండ్ చెల్లించనుంది.

**12,000 నియామకాలు**

వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26)లో ప్రాంగణ నియామకాల (క్యాంపస్ హైరింగ్) ద్వారా 10,000-12,000 మంది ఫ్రెషర్లను ఉద్యోగంలో చేర్చుకోనున్నట్లు విప్రో వెల్లడించింది. కాగా డిసెంబరు త్రైమాసికంలో ఉద్యోగుల సంఖ్య 1,157 తగ్గి 2,32,732కు పరిమితమైంది.

## కస్టమర్లకు కాల్ చేసేందుకు '1600xx' సిరీస్‌నే ఉపయోగించండి

### బ్యాంకులను కోరిన ఆర్‌బీఐ

ముంబై: బ్యాంకింగ్ రంగంలో పెరుగుతున్న ఆర్థిక మోసాలను నిరోధించేందుకు ఆర్‌బీఐ మరో నిర్ణయం తీసుకుంది. వాయిస్ కాల్స్, ఎస్ఎంఎస్‌ల ద్వారా జరుగుతున్న ఆర్థిక మోసాలకు అడ్డుకట్ట వేసేందుకు లావాదేవీల విషయమై ఖాతాదారులకు కాల్ చేసేందుకు '1600XX' సిరీస్ నంబర్లను మాత్రమే ఉపయోగించాలని బ్యాంకులను ఆర్‌బీఐ కోరింది. అలాగే, ప్రచార అవసరాల కోసం '140XX' సిరీస్ నంబర్లను మాత్రమే వినియోగించాలని నిర్దేశించింది. అంతేకాదు, బ్యాంకులు, ఇతర నియంత్రిత సంస్థలు తమ కస్టమర్ల డేటాబేస్‌ను పర్యవేక్షించడంతో పాటు ఎప్పటికప్పుడు ప్రక్షాళన చేస్తుండాలని సూచించింది. మార్చి31 నాటికి ఈ ఆదేశాలను అమలు చేయాలని స్పష్టం చేసింది.

**అకౌంట్లు, లాకర్లకు నామినీలుండాల్సిందే:** మరణించిన ఖాతాదారు కుటుంబ సభ్యులు లేదా సంబంధీకులకు క్లెయిమ్ సెటిల్‌మెంట్‌ను వేగవంతం చేసేందుకు అన్ని ఖాతాలు, లాకర్లకు నామినీ వివరాలు అందుబాటులో ఉండేలా జాగ్రత్త పడాలని బ్యాంకులకు ఆర్‌బీఐ సూచించింది. ప్రస్తుత, కొత్త డిపాజిట్ అకౌంట్లు, సేఫ్టీ లాకర్లకు నామినీలను నిర్ధారించాలని కోరింది.

## మూడు రోజుల ర్యాలీకి బ్రేక్

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లో మూడు రోజుల వరుస ర్యాలీకి తెరపడింది. ఐటీ, బ్యాంకింగ్, ఆర్థిక సేవల రంగ షేర్లలో అమ్మకాల కారణంగా ప్రామాణిక సూచీలు శుక్రవారం నష్టాల్లో ముగిశాయి. విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ, గరిష్ఠ స్థాయి ముడిచమురు ధరలు సైతం ట్రేడింగ్ సెంటిమెంట్‌ను ప్రభావితం చేశాయి. సెన్సెక్స్ ఒకదశలో 780 పాయింట్ల మేర పతనమైనప్పటికీ, మళ్లీ కాస్త కోలుకుంది. చివరికి సూచీ 423.49 పాయింట్ల నష్టంతో 76,619.33 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 108.60 పాయింట్లు కోల్పోయి 23,203.20 వద్ద క్లోజైంది.

## మారుతి ఈ-విటారా



దేశీయ కార్ల దిగ్గజం మారుతి సుజుకీ తొలి బ్యాటరీ విద్యుత్ కారు ఈ-విటారాను ఆవిష్కరించింది. ఈ కారు 49 కిలోవాట్లు, 61 కిలోవాట్ల బ్యాటరీ ఆప్షన్లలో అందుబాటులో ఉంటుంది. ఒకసారి చార్జింగ్ చేస్తే 500 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుంది. దీన్ని భారత్‌లోనే ఉత్పత్తి చేసి 100 దేశాలకు ఎగుమతి చేయనున్నట్టు ప్రకటించింది. ఈ మోడల్‌కు భారత్‌ను ప్రపంచ ఉత్పత్తి కేంద్రంగా చేయాలనుకుంటున్నట్టు కంపెనీ డైరెక్టర్, ప్రెసిడెంట్ తొషిహిరో సుజుకీ తెలిపారు.

**ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్**

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 112 | విజయవాడ | 131 |
| వరంగల్ | 112 | గుంటూరు | 130 |
| కరీంనగర్ | 112 | ఒంగోలు | 130 |
| మహబూబ్‌నగర్ | 112 | చిత్తూరు | 104 |
| కర్నూలు | 112 | నెల్లూరు | 109 |
| విశాఖపట్నం | 127 | అనంతపురం | 109 |
| గోదావరి | 131 | | |

**ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)**

| 18వ తేదీ | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 475 | విజయవాడ | 500 |
| వరంగల్ | 477 | గోదావరి | 495 |
| చిత్తూరు | 503 | విశాఖపట్నం | 500 |
| | | డజను గుడ్లు రూ. 72 | |

**బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)**

| | 24 క్యారెట్లు | 22 క్యారెట్లు | కేజీ వెండి |
|---|---|---|---|
| హైదరాబాద్ | 81,270 ▲ | 74,500 ▲ | 1,04,000 ▲ |
| విజయవాడ | 81,820 ▲ | 77,000 ▲ | 93,500 ▲ |
| విశాఖపట్నం | 79,290 ▲ | 72,680 ▲ | 91,760 ▼ |
| రాజమండ్రి | 84,270 ▲ | 74,500 ▲ | 91,700 ▲ |
| ప్రొద్దుటూరు | 80,350 ▲ | 74,400 ▲ | 93,500 ▼ |
| ముంబై | 79,239 ▲ | 72,583 ▲ | 90,820 ▼ |

Printed and Published by Koganti Venkata Seshagiri Rao, on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No :717 B/5, Thukivakam (Village & Post), Renigunta (Mandal) Chittoor District, Pin - 517520, Andhra Pradesh. Editor : N.Rahul Kumar. RNI No:44936/1987. Managing Director : Vemuri Radhakrishna. Founder : K.L.N. Prasad.

# రోడ్డు భద్రతా నియమాలు పాటించండి

● డీటీసీ నిరంజన్ రెడ్డి

చిత్తూరు సిటీ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రతా నియమాలు పాటించండి - ప్రమాదాలు నివారించండి అని డీటీసీ నిరంజన్ రెడ్డి చెప్పారు. 36వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో ఎల్ఎల్ఆర్, డ్రైవింగ్ లైసెన్స్‌కు వచ్చిన అభ్యర్థులకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మద్యం తాగి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ, విశ్రాంతి లేకుండా వాహనాలు నడపడం వల్లే ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. శనివారం మురకంబట్టులోని లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో ఉచిత కంటి వైద్యపరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్టీవో సునీల్ కుమార్, ఎంవీఐలు రాజేశ్వర్ రావు, టీఎస్ మురళి, నరసింహులు, దీపిక తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డీటీసీ నిరంజన్ రెడ్డి

## రైలు ఢీకొని ఒకరి మృతి

చిత్తూరు రూరల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): పూతలపట్టు మండలం వావిల్‌తోట వద్ద గురువారం రాత్రి రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. విల్లుపురం-తిరుపతి రైలు లోకో పైలట్ చిత్తూరు రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతిచెందిన వ్యక్తి ఉన్న లభ్యమైన ఆధారాల మేరకు సదుం మండలం చింతలవారిపల్లెకు చెందిన దేవేంద్రగా గుర్తించారు. ఇతను ఆత్మహత్యకు పాల్పడి ఉండొచ్చని రైల్వే పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతదేహాన్ని చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసినట్లు శుక్రవారం ఎస్ఐ తెలిపారు.

## కుప్పం టౌన్‌బ్యాంక్ పర్సన్ ఇన్‌చార్జి పదవీకాలం పొడిగింపు

కుప్పం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): కుప్పం కో ఆపరేటివ్ టౌన్ బ్యాంక్ పర్సన్ ఇన్‌చార్జి పదవీకాలం పొడిగిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులిచ్చింది. టౌన్ బ్యాంకుకు వైసీపీ హయాంలో భాగ్యరాజ్ ప్రభంజన్ చైర్మన్‌గా బోర్డును నామినేట్ చేసింది. కూటమిప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ బోర్డు రాజీనామాలు చేసింది. అప్పటినుంచి డిస్ట్రిక్ట్ కోఆపరేటివ్ ఆడిట్ ఆఫీసర్ కె.బ్రహ్మానందరెడ్డి బ్యాంక్‌కు పర్సన్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. ఈయన పదవీ కాలాన్ని మరో ఆరు నెలలపాటు.. తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు పర్సన్ ఇన్‌చార్జిగా కొనసాగిస్తూ ప్రభుత్వ ఎక్స్ అఫిషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్ ఉత్తర్వులు ఇచ్చారు.

## అలరించిన చిన్న కొండచుట్టు ఉత్సవాలు


చిన్నకొండచుట్టు మండపంలో భక్తుల రద్దీ

నగరి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి):నగరి మున్సిపాలిటీలోని బేరివీధిలో శుక్రవారం చిన్న కొండచుట్టు (ఊరు కొండచుట్టు) ఉత్సవాలు అలరించాయి. బేరివీధిలో వలస వ్యాపారులు వివిధ రకాల దుకాణాలు పెట్టడం ఆనవాయితీ. దీంతో ఇక్కడ తిరునాళ్ల సందడి కనిపించింది. చిన్నారుల ఆటబొమ్మలు, మహిళలకు సంబంధించిన అలంకరణ వస్తువులు, చెరకు గడలు, తినుబండారాలు విక్రయించారు. ఈ క్రమంలో వీధి మొత్తం జనంతో కిక్కిరిసింది.

## పారదర్శకంగా ఆలయ భూముల వేలం: టీడీపీ

కల్లూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): దేవుడి భూములకు సంబంధించి ఎలాంటి రాజకీయాలకు తావులేకుండా పారదర్శకంగా ఉండాలని రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గం టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి లెక్కల ధనంజయనాయుడు, మండల టీడీపీ కార్యదర్శి బండ్ల రమేష్ తెలిపారు. పులిచెర్ల మండలం దేవళంపేట లక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి సుమారు 13.87 ఎకరాలు భూములు ఉన్నాయి. ఈ భూములకు సంబంధించి ఈనెల 17న శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు కౌలు వేలం నిర్వహించాలని ఆలయ కార్యనిర్వహణాధికారి యువరాణి నిర్ణయించారు. ఈ మేరకు లక్ష్మీ నరసింహస్వామి ఆలయం వద్దకు శుక్రవారం ఉదయం 11 గంటలకు ఆమెతో పాటు టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ఫణిరాజ్, జూనియర్ అసిస్టెంట్ ప్రకాష్ చేరుకుని వేలం నిర్వహించేందుకు సమాయత్తమయ్యారు. ఆలయ భూములున్న అయ్యావాండ్లపల్లి, కల్లూరు, దేవళంపేట, బోడిరెడ్డిగారిపల్లి గ్రామాలకు చెందిన కొందరు గ్రామస్తులు టీడీపీ నాయకులతో కలిసి అక్కడకు చేరుకున్నారు. ప్రజలకు ముందస్తు సమాచారం లేకుండా నిర్వహిస్తున్న వేలం వాయిదా వేయాలని కోరారు. దండోరా రూపంలో ప్రజలకు సమాచారం ఇచ్చినట్లు ఆధారాలుంటే చూపాలని ఎండోమెంట్ అధికారులను నిలదీశారు. దీంతో కార్య నిర్వహణాధికారి యువరాణి మాట్లాడుతూ ఆలయ భూముల కౌలు వేలం విషయంలో ముందస్తు సమాచారం లేదని అభ్యంతరాలు రావడంతో వేలం వాయిదా వేస్తున్నామన్నారు. గ్రామాల్లో దండోరా వేయించి ప్రజలకు తెలియజేస్తామని, ఈనెల చివరికి తిరిగి వేలం నిర్వహిస్తామని తెలిపారు.

## మామిడిచెట్ల తొలగింపుపై పోలీసులకు ఫిర్యాదు

కల్లూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం 102 రామిరెడ్డిగారిపల్లి రెవెన్యూ గ్రామంలోని తన భూమిలో 25 ఏళ్ల క్రితం నాటిన సుమారు 30 మామిడిచెట్లను రొంపిచెర్ల మండలం కొండ్రెడ్డిగారిపల్లికి చెందిన మధుసూదన్‌రెడ్డి జేసీబీతో తొలగించినట్లు తిరుపతికి చెందిన రామకృష్ణమనాయుడు భార్య రాధ శుక్రవారం కల్లూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలి కథనం మేరకు.. తనకున్న 5.30 ఎకరాల వ్యవసాయ భూమిలో 25 ఏళ్ల క్రితం మామిడి మొక్కలు నాటి ఫలసాయం పొందుతున్నారు. ఆమె మామిడి తోటకు పడమర వైపున మధుసూదన్‌రెడ్డికి చెందిన భూమి ఉంది. ఈనెల 16న ఆమెకు చెందిన తోటలోని 30 మామిడిచెట్లను మధుసూదన్‌రెడ్డి జేసీబీతో తొలగించి భర్తకు ఫోన్ చేసి బెదిరించాడని తెలిపారు. దీంతో పొలం వద్దకు చేరకుని మధుసూదన్‌రెడ్డి గుమస్తా సుబ్రమణ్యం తదితరులను ప్రశ్నించగా తమపై దురుసుగా ప్రవర్తించారని.. దీనిపై న్యాయం చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కల్లూరు ఎస్ఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మామిడిచెట్లు తొలగింపుపై విచారణ చేపడుతున్నామని తెలిపారు.

## ఘనంగా ఎంజీఆర్ జయంతి


కేక్ కట్ చేస్తున్న ఎంజీఆర్ అభిమానులు

చిత్తూరు కల్చరల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు మాజీ సీఎం ఎంజీఆర్ జయంతిని అన్నాడీఎంకే కార్యకర్తలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఎంజీఆర్ వీధిలో జరిగిన ఈ కార్యక్రమంలో కేక్ కట్ చేసి.. పేదలకు అన్నదానం చేశారు. మురకంబట్టులో కార్పొరేటర్ నవీన్ ఆధ్వర్యంలోనూ వేడుకలు జరిగాయి. అఖిల భారత అన్నాడీఎంకే డిప్యూటీ సెక్రటరీ రవూఫ్ బక్కర్, గణేష్, రాజా, రాజశేఖర్, సుబ్రహ్మణ్యం బాబు, మణి, మాశిలామణి తదితరులు పాల్గొన్నారు.

### చీరల పంపిణీ



**నగరి:** ఎంజీఆర్ జయంతి వేడుకలు శుక్రవారం నగరిలో ఘనంగా నిర్వహించారు. పుదుపేట, ఏకాంబరకుప్పం, చింతలపట్టెడ, సత్రవాడ, కేవీపీఆర్‌పేట ప్రాంతాల్లోని 108 మంది మహిళలకు ఎంజీఆర్ అభిమానులు చీరలను పంపిణీ చేశారు. నటరాజన్, తమిళ్‌మణి, కళైమణి, కౌన్సిలర్ మోహన్‌రాజ్, రామన్, ఎల్లప్పన్, పొన్నుస్వామి తదితరులు పాల్గొన్నారు.

## నగరి డీఎస్పీగా అజీజ్

నగరి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): నగరి డీఎస్పీగా సయ్యద్ మహమ్మద్ అజీజ్ నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం ఉత్తర్వులు జిల్లా అధికారులకు అందాయి.

## నేడు ఎన్టీఆర్ విగ్రహానికి క్షీరాభిషేకం

పూతలపట్టు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా శనివారం పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ దొరబాబు చౌదరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు పాలకూరులోని ఎన్టీఆర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తామన్నారు. మండలకేంద్రంలో పేదలకు అన్నదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని కోరారు.

## నేడు పూతలపట్టు మండల సమావేశం

పూతలపట్టు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): పూతలపట్టు మండల సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో నాగరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో ఉదయం 11 గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మురళీమోహన్ పాల్గొంటారని, అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోరా?

పెనుమూరు-చిత్తూరు మార్గంలో చాలాచోట్ల ధ్వంసమైన రోడ్డు


రేణుకానగర్ వద్ద రోడ్డుపై ఉన్న గుంత

పెనుమూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): పెనుమూరు నుంచి చిత్తూరు వెళ్లే మార్గంలో చాలాచోట్ల రోడ్డు ధ్వంసమైంది. దీనివల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకునేవారు కరువయ్యారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రేణుకానగర్ వద్ద నడిరోడ్డుపై కల్వర్టుకు పెద్ద గుంతపడి ఆరునెలలు అవుతోంది. ఇక్కడ నాలుగు ప్రమాదాలు జరిగినట్లు స్థానికులు తెలిపారు. ఇదే మార్గంలో గంగుపల్లె చెరువు వద్ద ఎన్నికలకు ముందు కొంత దూరం రోడ్డును తవ్వేశారు. తర్వాత పనులు ఆపేయడంతో ఇరుకు రోడ్డులో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక్కడ ఓ కారు బోల్తా కొట్టడంతో ఇద్దరు తీవ్రగాయాలతో ఆస్పత్రి పాలయ్యారు. మరో రెండు ద్విచక్ర వాహన ప్రమాదాల్లో ఇద్దరికి కాలు విరిగింది. ఉగ్రాణంపల్లె లింకు రోడ్డు వద్ద గుంతలు ఉండటంతో ద్విచక్రవాహనదారులు అదుపు తప్పి కిందపడుతున్నారు. దీనిపై పలుసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించక పోవడంతో స్థానిక సర్పంచ్ మట్టితోలారు. పెద్దరాజుపల్లె వద్ద గుంతలు పెద్దవిగా పడటంతో ఇక్కడా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇకనైనా సంబంధిత అధికారులు ఈ మార్గంలోని రోడ్డును బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు.


గంగుపల్లె చెరువు వద్ద రోడ్డు దుస్థితి

# పంచాయతీలకు కార్యదర్శుల కొరత / ఇబ్బంది పడుతున్న జనం

వెదురుకుప్పం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): పంచాయతీలకు కార్యదర్శుల కొరతతో జనం ఇబ్బంది పడాల్సి వస్తోంది. కార్వేటినగరం మండలంలో 22 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందులో కార్వేటినగరం మేజర్ పంచాయతీ కావడంతో దీన్ని మూడు సచివాలయాలుగా విభజించారు. అంటే ఈ మండలంలో 24 మంది గ్రామ కార్యదర్శులు ఉండాలి. కానీ 12 మందితోనే నెట్టుకొస్తున్నారు. ఇందులో కూడా ఎం.ఎంవిలాసం, గోపిశెట్టిపల్లె, ఎల్ఆర్ పేట పంచాయతీలకు కార్యదర్శిగా ఉన్న ఎ.హేమాద్రి గత ఏడాది డిసెంబరు నుంచి దీర్ఘకాలిక సెలవులో ఉన్నారు. అంటే 11 మంది మాత్రమే ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్నారు. ● వెదురుకుప్పం మండలంలో 25 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇక్కడా 23 మందే ఉన్నారు. అగ్గిచేనుపల్లె, నల్లవెంగనపల్లె పంచాయతీలకు రెగ్యులర్ కార్యదర్శులు లేరు. దీనివల్ల కార్యదర్శులపైనా పనిభారం పెరుగుతోంది.

### పాలసముద్రం మండలంలో ఇలా..

పాలసముద్రం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): పాలసముద్రం మండలంలో 13 పంచాయతీలున్నాయి. వీటిల్లో బాలకృష్ణాపురం, తిరుమలరాజుపురం, వనదుర్గాపురం పంచాయతీలకు మాత్రమే కార్యదర్శులు ఉన్నారు. శ్రీకావేరిరాజుపురం కార్యదర్శి రెండు నెలల నుంచి లీవులో ఉన్నారు. ఎస్ఆర్ఆర్‌కండ్రిగ, కృష్ణజిమ్మాపురం కార్యదర్శులు సుమారు నెల రోజులుగా సెలవులో ఉన్నారు. మిగిలిన పంచాయతీల్లోని కార్యదర్శులు బదిలీపై ఇతర మండలాలకు వెళ్లారు. వీరి స్థానాల్లో ఎవరినీ నియమించలేదు. ఈ నేపథ్యంలో ఉన్న ముగ్గురు కార్యదర్శుల పైనే అదనపు భారం పడటంతో విధులు సరిగా నిర్వహించలేకున్నారు. దీనివల్ల జనం ఇబ్బంది పడాల్సి వస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అన్ని పంచాయతీలకు కార్యదర్శులను నియమించాలని స్థానికులు కోరుతున్నారు.

## తిరుమలకు కోలాట బృందం పాదయాత్ర


బలిజకండ్రిగ ఆలయం వద్ద కోలాటం వేస్తున్న కృష్ణజిమ్మాపురంవాసులు

పాలసముద్రం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): కృష్ణజిమ్మాపురం వాసులు కొత్తగా కోలాటం నేర్చుకున్నారు. శుక్రవారం 30 మంది కోలాట బృందం సభ్యులు పాదయాత్రగా తిరుమలకు బయల్దేరి వెళ్లారు. దారిలోని ఆలయాల వద్ద కోలాటం వేసి, పూజలు చేస్తూ వెళతామని తెలిపారు.

## త్రుటిలో తప్పిన ప్రమాదం


ఎక్స్‌కవేటర్‌పై కూలిన ట్రాన్స్‌ఫార్మర్‌తో కూడిన విద్యుత్ స్తంభం

తవణంపల్లె, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్తంభాన్ని ఎక్స్‌కవేటర్ ఢీకొన్న సంఘటనలో త్రుటిలో ప్రమాదం తప్పింది. అరగొండ-జొన్నగురకల మార్గంలో గుర్రప్ప వ్యవసాయ బావి వద్ద రహదారి పక్కన ఉన్న ముళ్ల కంపలను ఎక్స్‌కవేటర్‌తో శుక్రవారం తొలగిస్తున్నారు. ప్రమాదవశాత్తూ రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఎక్స్‌కవేటర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో విద్యుత్ స్తంభంతోపాటు దానికున్న ట్రాన్స్‌ఫార్మర్ ఎక్స్‌కవేటర్‌పై కూలింది. గమనించిన ఎక్స్‌కవేటర్ డ్రైవర్ వెంటనే కిందకు దూకేయడంతో ప్రమాదం తప్పింది.

## రైలు ఢీకొని పెయింటర్ మృతి


కృష్ణమూర్తి మృతదేహం

కుప్పం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండలం బంగారునత్తం సమీపంలో ప్రమాదవశాత్తు రైలు ఢీకొని కృష్ణమూర్తి అనే వ్యక్తి మృతి చెందాడు. రైల్వే హెడ్ కానిస్టేబుల్ రమేశ్ కథనం మేరకు.. కుప్పం మండలం వెండుగంపల్లెకు చెందిన కృష్ణమూర్తి పెయింటర్. ఈయనకు ఇద్దరు భార్యలు. కుటుంబ జీవనం సక్రమంగా లేకపోవడంతో మద్యానికి అలవాటు పడ్డాడు. మద్యం మత్తులో పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందాడు. కృష్ణమూర్తి మృత దేహాన్ని రైల్వే పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం కుప్పం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

## టీడీపీపై రాష్ట్ర ప్రజలకు విశ్వాసం: గౌనివారి

శాంతిపురం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): టీడీపీపై రాష్ట్ర ప్రజల్లో విశ్వాసం పెరిగిందని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. టీడీపీ సభ్యత్వ నమోదు కోటి దాటడమే ఇందుకు నిదర్శమని ఆయన పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు పరిపాలన దక్షత, మంత్రి నారా లోకేశ్ కార్యకర్తల సంక్షేమానికి తీసుకున్న విప్లవాత్మక చర్యలను ప్రజలు హర్షిస్తున్నారని తెలియజేశారు.

## కూలడానికి సిద్ధంగా విద్యుత్ స్తంభం



గుడిపాల, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు - వేలూరు జాతీయ రహదారిలోని 190 రామాపురం సీఎంసీ వద్ద ఓ విద్యుత్ స్తంభం కూలడానికి సిద్ధంగా ఉంది. హైవే నిర్మాణ పనుల్లో భాగంగా స్తంభం కింద తవ్వేయడంతో ఎప్పుడు పడిపోతుందోనని ఈ మార్గంలో ప్రయాణించేవారు భయపడుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## క్రికెట్ టోర్నీ విజేతలకు బహుమతుల ప్రదానం



నగరి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): చింతలపట్టెడలో సంక్రాంతి సందర్భంగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. మొత్తం 14 టీమ్‌లు పాల్గొన్నాయి. శుక్రవారం మధ్య వీధి, కొత్తవీధి టీమ్‌లు ఫైనల్‌లో తలపడ్డాయి. మధ్యవీధి టీమ్ విన్నర్‌గా రూ.5000, కొత్తవీధి టీమ్ రన్నర్‌గా రూ.3000లను బహుమతులుగా దక్కించుకున్నాయి. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును ప్రేమ్ దక్కించుకున్నారు. విజేతలకు మున్సిపల్ చైర్మన్ నీలమేఘం, మణి బహుమతులను ప్రదానం చేశారు.

## వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



యాదమరి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): జాతీయ కుష్ఠు నిర్మూలన సర్వేకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను శుక్రవారం యాదమరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ, హెల్త్ సూపర్‌వైజర్లు సెల్వరాణి, లక్ష్మీపతి, ఎంఎల్‌హెచ్‌పీలు, మహిళా ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## రెవెన్యూ సమస్యలకు తక్షణ పరిష్కారం: జేసీ

రామకుప్పం/శాంతిపురం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చే రెవెన్యూ సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలని జాయింట్ కలెక్టర్ విద్యాధరి కోరారు. శుక్రవారం ఆమె కుప్పం ఆర్డీవో శ్రీనివాసరాజుతో కలిసి భూసర్వే పైలట్ ప్రాజెక్టుకు ఎంపిక చేసిన రామకుప్పం మండలం గిడ్డపల్లె, శాంతిపురం మండలంలోని పలు గ్రామాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా తహసీల్దార్లు, వీఆర్వోలు, సర్వేయర్లతో సమావేశాలు నిర్వహించి, పలు సూచనలిచ్చారు.

## రంకేసిన కోడెగిత్తలు

ఐరాల, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): చెంగనపల్లెలో శుక్రవారం జల్లికట్టు నిర్వహించారు. కోడెగిత్తలు, ఎద్దులు రంకెలేస్తూ అల్లెలో పరుగులు తీస్తుంటే యువకులు పోటీపడి వాటిని నిలువరించడానికి ప్రయత్నించారు. జల్లికట్టును చూడటానికి తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి కూడా జనం తరలివచ్చారు. గ్రామస్తులు ఓ కోడెగిత్త కొమ్ములకు కట్టిన సీఎం చంద్రబాబు ఫొటో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.



కోడెగిత్తను నిలువరిస్తున్న యువకులు - కోడెగిత్త కొమ్ములకు కట్టిన సీఎం చంద్రబాబు ఫొటో

## సంక్షిప్తంగా..

### ద్రౌపది అమ్మవారికి పూజలు



వెదురుకుప్పం, జనవరి 17(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని ద్రౌపది అమ్మవారి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. భక్తులను అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

### దివ్యాంగులకు శ్రీవారి దర్శనం సుగమం చేయండి

చిత్తూరు సిటీ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు తిరుమల శ్రీవారి దర్శనాన్ని సుగమం చేయాలని జాతీయ అంధుల సమాఖ్య జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి భూపతి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఆన్‌లైన్ దర్శనాల వల్ల చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, పాత పద్ధతినే అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

### ఆరిమాని గంగమ్మకు పూజలు


అమ్మవారి ఆలయంలో జయశంకర్ నాయుడు తదితరులు

శ్రీరంగరాజపురం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఆరిమాకుపల్లెలోని ఆరిమాని గంగమ్మకు శుక్రవారం టీడీపీ మండల అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు హిమచలపతిరెడ్డి, జలంధర్ నాయుడు, అర్చకుడు వెంకటాచలపతి, జనసేన నాయకుడు చందు తదితరులు పాల్గొన్నారు.

### థామస్ చొరవతో తాగునీటి సమస్య పరిష్కారం

శ్రీరంగరాజపురం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): చిన్నబావనపల్లె దళితవాడలో తాగునీటి సమస్య రావడంతో ప్రభుత్వ విప్ డాక్టర్ థామస్ దృష్టికి స్థానికులు తీసుకెళ్లారు. స్పందించిన ఆయన సమస్యను పరిష్కరించాలని ఎంపీడీవో మోహన్ మురళిని ఆదేశించారు. శుక్రవారం ఎంపీడీవో దళితవాడకు వెళ్లి కొత్త బోరు పైపులు ఏర్పాటు చేశారు. రూ.3లక్షల జడ్పీ నిధులు మంజూరు చేయించి, సమస్య పరిష్కరించడంతో థామస్‌కు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

### సమస్యలపై కార్యకర్తలు స్పందించాలి: టీడీపీ

గుడిపాల, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): గ్రామస్థాయిలో వచ్చే సమస్యలపై కార్యకర్తలు స్పందించి.. పరిష్కరిస్తే ప్రజలకు మనపై నమ్మకం ఉంటుందని టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, సీనియర్ నాయకుడు గురజాల చెన్నకేశవులు నాయుడు అన్నారు. శుక్రవారం వారు మీడియాతో మాట్లాడుతూ.. సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, త్వరగా పరిష్కరించే దిశగా చూడాలని చెప్పారు.

### శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు

చౌడేపల్లె, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు అమ్మవారికి రాహుకాలంలో పంచామృతాభిషేకాలు, పసుపు, కుంకుమ, గంధభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు రాహుకాల పూజలో పాల్గొన్నారు. ఆలయ ఈవో ఏకాంబరం ఏర్పాట్లు పర్యవేక్షించారు.

### వైష్ణవిదేవికి అభిషేకాలు

పుదిపట్లలో వెలసిన వైష్ణవిదేవికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ నిర్వాహకులు వినోద్‌కుమార్‌రెడ్డి, శ్రావణి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.